విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, శనివారం 08, మార్చి 2025

పుష్ప రేంజ్‌లో.. బేతంచెర్లలో అక్రమ కలప వ్యాపారం

విశాలాంధ్ర -బేతంచర్ల: బేతంచెర్ల మండలంలో గోరుమాను కొండ, సీతారామపురం, ఎంబాయ్ ముద్దవరం, ముసలాయి చెరువు,పెండెకళ్ళు, రేపల్లె, వీరాయి పల్లె, తదితర గ్రామల సమీపంలో విస్తారంగా అడవులు ఉండడంతో మండలానికి చెందిన ఒక యువకుడు పుష్ప రేంజ్‌కి ఏమాత్రం తగ్గకుండా, తమ వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించుకొని, యథేచ్ఛగా అక్రమంగా కలపను తరలిస్తూ, అడవులను ఖాళీ చేస్తున్నాడు. అటవీ ప్రాంతాల్లో ఉన్న చెట్లను ముక్కలు, ముక్కలుగా కట్ చేసి లారీలు, ట్రాక్టర్లలో యదేచ్ఛగా అక్రమ కలపను దొంగిలించి తీసుకుపోతున్నా, ఈ పుష్ప అటవీ దొంగను ఏమి చేయకుండా సంబంధిత శాఖ అధికారులే కాపాడుతూ ఎక్కడ కేసులు నమోదు కాకుండా జాగ్రత్తలు పడడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. వీటిలో భాగంగానే శుక్రవారం రేవల్లె సమీపంలోని అడవిలో నుంచి వస్తున్న ఏపీ 39టిటి 6651 అనే నంబర్ గల మినీ లారీని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రమణారెడ్డి తన బృందంతో వెళ్లి సీజ్ చేశారు. అయితే మినీ లారీలో పెద్దపెద్ద దొంగలు ఉండగా, సదరు అధికారి మాత్రం వంట చెరకు అని చెప్పడం గమనార్హం. అడవుల్లో ఉన్న నారేప, నీరుద్ధి, ఇనుముద్ది, టేకు, సోమ వంటి చెట్లను నిబంధనలకు విరుద్ధంగా నరక కూడదని ఉన్నా ఆ యువకుడు అడవులే తమకు ధనార్జనను తెచ్చి పెట్టె కల్పతరువుగా భావించి, అక్షయ పాత్రలా అడవు లలో ఉన్న కలపను అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నాడు. అక్రమ కలపను తరలించే దొంగల ముఠాకు రియల్ పుష్పగా మారిన ఆ యువకుడికి అధికారులు, రాజకీయ నాయకుల అండదండలు, ఆదరణ పుష్కలంగా ఉంటుందని పలువురు ప్రజలు బహిరంగంగానే చర్చించుకుంటూ ముక్కున వేలేసుకుంటున్నారు. ఈ అక్రమ కలపను ఇటుకల బట్టీలకు, గోడౌన్లకు యదేచ్ఛగా తరలిస్తూ పుష్ప రేంజ్‌ని తలదన్నెలా తన సామ్రాజ్యాన్ని విస్తరిం చాడు ఇక్కడి పుష్ప. కాగా, ఇదే యువకుడు తన సామ్రాజ్యాన్ని విస్తరించే భాగంలో కలపను ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నా, అడవుల విస్తీర్ణం ప్రశ్నార్థకంగా మారుతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు ఉండడం కొసమెరుపు. కాగా, పట్టుబడ్డ మినీ లారీని అధికారులు పోలీస్ స్టేషన్‌కు లేదా సంబంధిత ఫారెస్ట్ శాఖ కార్యాలయానికి తరలించాల్సి ఉన్న ఒక ప్రైవేట్ కలప గోడౌన్‌కు తరలించడం గమనార్హం. ఈ విషయంపై ఎఫ్ఆర్‌వో రమణా రెడ్డి విశాలాంధ్ర వివరణ కోరగా, అడవుల్లో అక్రమంగా కలపను తరలించే విషయం వాస్తవమని, అడవుల సంరక్షణకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఎమ్మెల్యే చొరవతో పరవళ్ళు తొక్కుతున్న పంట కాలువలు

విశాలాంధ్ర - శిరివెళ్ల : ఆరుగాలం కష్టపడి పండించిన పంట పొలాలు చేతికందే దశలో సాగునీరు నిలిచి అన్న దాతలకు తీరని వేదన ఆవేదన మిగిల్చిన సంఘటనపై ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ వెంటనే స్పందించి మోడు వారిన అన్నదాతల ఆశలను సజీవం చేసిందని కేసీ కెనాల్ నీటి సంఘం అధ్యక్షులు చిలకల రాంపుల్లయ్య అన్నారు. మండల పరిధిలోని 16వ లాకు వద్ద శుక్రవారం కేసీ కెనాల్‌లో వస్తున్న నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా నీటి సంఘం అధ్యక్షులు చిలకల రాంపుల్లయ్య మాట్లాడుతూ అన్నదాతలకు అండ దండగా నిలిచేది నాడు నేడు ఒక భూమా నాగిరెడ్డి కుటుంబ సభ్యులు వారసులే అని పేర్కొన్నారు. 16వ లాకు కింద, శిరివెళ్ల మండల వ్యాప్తంగా ఏసీ ఆయకట్టు కింద సాగు చేసిన పంట పొలాలకు నీరు అందకపోవడంతో ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ, భార్గవరామ్, జగత్ విఖ్యాత రెడ్డి రైతుల పక్షాన నిలబడి సమస్యలు పరిశీలించి జిల్లా ఇరిగేషన్ శాఖ అధికారులతో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రితో మాట్లాడి అసాధ్యం అనుకున్న నీటి ప్రవాహాన్ని సుసాధ్యం చేసి చరిత్ర సృష్టించారని చిలకల రాంపుల్లయ్య పేర్కొన్నారు. దుక్కి దున్ని నారు పోసి ద్రమ్ములు చేసి నాటు వేసి పెట్టుబడి పెట్టి పంట చేతికి అందే చివరి దశలో నీరు రాకపోవడంతో రైతన్నలు విలవిలలాడారు. నేడు భూమా చొరవతో సాగునీరు పరవళ్ళ తొక్కడంతో అన్నదాతలు భారీ నష్టాల బాట నుండి గట్టెక్కినట్లు అయిందని రాంపుల్లయ్య పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ తెలుగుదేశం పార్టీ యువనేత 29వ నీటి సంఘం అధ్యక్షులు కమతం లక్ష్మిరెడ్డి, 28వ నీటి సంఘం అధ్యక్షులు నాగేశ్వర్ రెడ్డి రైతులు అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

చుక్కల దుప్పి మృతి..

విశాలాంధ్ర - ఆత్మకూరు రూరల్: అటవీ శాఖ ఆత్మకూరు రేంజ్ పరిధిలోని ఎర్ర గూడూర్ బానకచర్ల అటవీ సమీపం లోని పంట పొలాల్లోని బావిలో పడి దుప్పి మృతి చెందిందని సమాచారం తెలుసుకున్న ఫారెస్ట్ శాఖ అధికారులు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. అనంతరం మృతిచెందిన చుక్కల దుప్పిని ఆత్మకూరు ఫారెస్ట్ రేంజ్ కార్యాలయానికి తరలించి వెటర్నరీ వైద్యులు పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం అటవీ శాఖ అధికారుల సమక్షంలో దుప్పిని ఖననం చేశారు. ఫారెస్ట్ సెక్షన్ అధికారి మాట్లాడుతూ దుప్పిని గమనించినా కుక్కలు వెంబడించడంతో తప్పించుకునే క్రమంలో అదుపుతప్పి బావిలో పడినట్లు ఫారెస్ట్ సెక్షన్ అధికారి స్వరూప్ తెలిపారు. వెటర్నరీ వైద్యులు, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు సర్వశక్తిమంతులు

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: జన్మతః స్త్రీలు శక్తివంతులు, సమర్థవంతులని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టర్ ఛాంబర్ లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలిసిన మీడియా విలేకర్లతో జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ మహిళలు ఉన్నతమైన వ్యక్తిత్వంతో పాటు ఆత్మాభిమానం కలిగి ఉంటారన్నారు. మహిళలు సర్వశక్తివంతులని, కుటుంబ బాధ్యతలతో పాటు ఉద్యోగంలో వున్నా, వ్యాపార, రాజకీయ ఇతర రంగాలలో స్థిరపడాలన్నా, ఆయా రంగాలలో ఉత్తమ విజయాలు సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానన్నారు. నిర్దేశించిన ఏ చిన్న పనైనా ప్రణాళిక బద్ధంగా నిర్వహించి 100 శాతం విజయం సాధించ గలిగే సత్తా వారిలో ఉంటుందని కలెక్టర్ తెలిపారు. ప్రతి స్త్రీ ఏదైనా రంగంలో పట్టు సాధించాలంటే సంబంధిత అంశంపై లోతైన విశ్లేషణ ఉండడంతో పాటు పదిమందికి స్ఫూర్తినిచ్చే విధంగా ప్రశ్నించే తత్వం కలిగి ఉండాలన్నారు. సమాజంలో స్థిరపడిన మహిళ పారిశ్రామికవేతలు వారు ఎదగడమే కాకుండా పదిమందికి ఉపాధి కల్పించే రీతిలో ఉండాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

నేడు పట్టణంలో ఎమ్మెల్యే ప్రజా దర్బార్

విశాలాంధ్ర - ఆత్మకూరు టౌన్: మండల, మున్సిపాలిటీ పరిధిలోని సమస్యల పరిష్కారానికి శనివారం తహసీల్దార్ కార్యాలయం వేదికగా శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి ప్రజా దర్బార్ నిర్వహించ నున్నారు. ప్రజల నుంచి నేరుగా ఎమ్మెల్యే సమస్యలపై వినతులను స్వీకరిస్తారు. ఇందుకు గాను వ్యక్తిగత, సామాజిక సమస్యలను ప్రజా దర్బార్‌లో తన దృష్టికి తీసుకురావాలని కోరారు. మండల, పట్టణ పరిధిలోని అన్ని విభాగాలకు సంబంధించిన సమస్యలపై వినతులు స్వీకరిస్తామన్నారు. శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం వరకు వినతులను స్వీకరించనున్నట్టు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి పిలుపునిచ్చారు.

కాలినడకన బయలు దేరిన మరియదళం

విశాలాంధ్ర - నందికొట్కూరు: నియోజవర్గ పరిధిలోని మిడుతూరు మండలం ఉప్పలదడియ విచారణలో ఫాదర్ మధుబాబు ఆధ్వర్యంలో ఉపవాస దినాలు ప్రారంభం సందర్భంగా మొదటి శుక్రవారం క్రైస్తవ సోదరీ సోదరీమణులు మరియదళం సభ్యులు కర్నూలు బిషప్ చర్చి వద్దకు పాదయాత్రగా కాలినడకన భక్తిశ్రద్ధలతో వెళ్లడం జరిగింది. ముందుగా విచారణలోని 10 గ్రామాలు ,ఉదయం 6 గంటలకు దేవనూరు, చౌటుకూరు మరియదళం సభ్యులు 49 బన్నూర్ కు చేరుకోవడం జరిగింది. ఇక్కడ ఫాదర్ మధుబాబు దైవ సందేశం ఇచ్చి మరియదళం పాదయాత్రను ప్రారంభించారు. ఈ పాదయాత్ర భక్తిశ్రద్ధలతో, దేవుని పాటలతో కడుమూరు, ఉప్పల దడియ, దిగువపాడు, గార్గేపురం మీదుగా ప్రేమగిరికి చేరుకొని అక్కడ నుంచి వెంకయ్య పల్లి మీదుగా కర్నూలు బిషప్ చర్చికి చేరుకోవడం జరిగింది. కర్నూల్ బిషప్ చర్చి నందు బిషప్ తండ్రి దివ్యబల్లి పూజను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 10 గ్రామాల ఉపదేశులు, దైవ నిర్వాహకులు, విచారణలోని అన్ని గ్రామాల మరియదళం సభ్యులు, క్రైస్తవ సోదరులు తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: తైక్వాండో అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ వారిచే తెనాలిలో జరిగిన స్టేట్ లెవెల్ తైక్వాండో పోటీలలో ఎల్ కెఆర్ గ్లోబల్ స్కూల్ విద్యార్థి మోక్షిత్ (మూడవ తరగతి) అండర్ 22 కేజీ విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి బ్రాంజ్ మెడల్ సాధించాడు. పాఠశాల యాజమాన్యం ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్, కోఆర్డినేటర్స్, ఏవో, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు అభినందించారు.

ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎన్ఎండీ ఫయాజ్

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : పట్టణంలోని సయ్యద్ షా నూరుల్లా ఖాద్రి మసీదు నందు ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందులో టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ పాల్గొన్నారు. ఉపవాస దీక్షావ రులతో, అభిమానులతో ఆయన ఉపవాస దీక్షను విరమింపచేశారు. అనంతరం ఎన్ఎండీ ఫయాజ్‌ను ముస్లిం మత పెద్దలు శాలువాతో ఘనంగా సన్మానించారు.

దేవాదాయ భూములపై పెరుగుతున్న రగడ

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల: సంవత్సరాలుగా బహి రంగ వేలం సమావేశాలలో దేవాదాయ భూములను కౌలుకు తీసుకుని సాగు చేస్తున్న రైతన్నలకు కోలుకోలేని దెబ్బ తగులుతున్నది. అన్నదాతల జీవనోపాధిని గండికోట్టేలా వ్యవహరిస్తున్నారు. వచ్చని దేవాదాయ సాగుభూములను లీజు పేరుతో సిమెంట్ పరిశ్రమలకు కట్టబెడు తున్నడపై ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. గ్రామం లో బహిరంగ కౌలు సాగుకు వేలం వేయకుండా దేవాదాయ శాఖ అధికారులు గుట్టుగా సిమెంట్ కంపెనీ కట్టబెట్టడంపై అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాంకో, దేవాదాయ శాఖ అధికారుల మధ్య మతలబు ఏమిటని ప్రశ్నిస్తున్నారు. మండలంలోని కలవటాల గ్రామ పరిధిలో ఉన్న రాంకో సిమెంట్ పరిశ్రమకు ఆ గ్రామ పరిధిలోని దేవాదాయ శాఖ భూములపై ఎప్పటినుండో కన్ను పడింది. రాంకో యాజమాన్యం వేలాది ఎకరాల సాగు భూములు కొనుగోలు చేసినప్పటికీ ఆలయ భూములే కీలకంగా మారా యి. గత కొన్ని సంవత్స రాలుగా సర్వేనెంబర్ 197, 199, 309లలో 3916ఎకరాల ఆలయ భూము లపై గ్రామ రైతు లకు రాంకో యజమా న్యానికి మధ్య వివాదం కొనసాగుతున్నది. ఎప్పటి నుండో దేవాదాయ భూములను కౌలుకు తీసుకునిసాగు చేసుకుంటున్న రైతులను వక్కకు పెట్టి గుట్టుగా గత మూడు సంవత్సరాలుగా రాంకోకు లీజుకి ఇస్తుండడంపై ఆరోపణలు వెలువెత్తు తున్నాయి. గ్రామంలో కౌలు సాగుకు బహిరంగ వేలం వేయకుండా గుట్టుగా నడుపుతుం డడంతో ఈనెల 5వ తేదీన ఆలయం భూములలో జరుగుతున్న పనులను కొందరు రైతులు ఆక్షేపణ వ్యక్తం చేశారు. దీంతో రైతులు, రాంకో అధికారుల మధ్య మాటల యుద్ధం పెరిగి స్థానిక పోలీస్ స్టేషన్‌కు ఈ పంచాయతీ వెళ్లినట్టు ప్రజలు చర్చించు కుంటున్నారు. రాంకో సంస్థ ఈ ఆలయ భూములను తీసుకొని మరోచోట భూములు ఇచ్చేల ప్రతిపాదన చేసిన స్థానిక రైతులు మాత్రం వ్యతిరేకిస్తున్నారు. ఎక్కడో భూములు ఇస్తే కౌలుకు తీసుకునే రైతులు ఎలా సాగు చేసుకుంటారని ప్రశ్నిస్తున్నారు. ఉన్నత స్థాయిలో రాంకో అధికారులు ప్రయత్నాలు చేస్తున్న ఓ కొలిక్కి రాకపోవడం వివాదం మరింత పెరుగుతోంది.

సమాజాభివృద్ధిలో మహిళ స్థానం గొప్పది

విశాలాంధ్ర -డోన్ : సమాజాభివృద్ధిలో మహిళ స్థానం గొప్పదని ఎస్టీయు నాయకులు స్పష్టం చేశారు. శుక్రవారం హుసేనాపురం ఉన్నత పాఠశాలలో పాఠ శాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు చంద్రమౌళి అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్య క్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్రో పాధ్యాయ సంఘం నాయకులు మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా గత చరిత్రను తెలియజేస్తూ వర్తమానంలో మహిళలు ఎన్నో రంగాలలో ముందంజలో ఉన్నారని, ఎన్నో రంగాల్లో అత్యున్నత స్థాయిలో రాణిస్తున్నారని,నవ సమాజ స్థాపనలో, సమాజ పురోభివృద్ధిలోనూ మహిళల పాత్ర చాలా గొప్పగా ఉందని పేర్కొన్నారు. ప్రస్తుతం భారతదేశ రాష్ట్రపతిగా మహిళ కొన సాగడం, దేశ ఆర్థిక మంత్రిగా మరో మహిళ విధులు నిర్వహిస్తుండడం మహిళా సాధికారతను సూచిస్తున్న ప్పటికీ దేశంలో మహిళా సాధికారత ఇంకా ఆశించినంత స్థాయిలో కనిపించడం లేదని తెలిపారు. ఈ సందర్భంగా హుసేనాపురం ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యా యినిలకు రాష్ట్రోపా ధ్యాయ సంఘం నాయకులు ఘనంగా శాలువా, గిఫ్టులతో సన్మానించడం జరిగింది. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు సర్వజ్ఞమూర్తి, గోపాల్, విజయ్ చార్లెస్, శ్రీనివాసులు రంగస్వామి, రమేష్ బాబు పాల్గొన్నారు. మహిళా ఉపాధ్యాయులు రాగవేణి, సుజాత, పద్మావతమ్మ, లక్ష్మీదేవి, జయలక్ష్మి, నీలోఫర్, పద్మావతి, విజయలక్ష్మి, వరలక్ష్మిలకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఎస్టియు రాష్ట్ర కౌన్సిలర్ వెంకట్ నాయక్, జిల్లా ఉపాధ్యయ వాణి కన్వీనర్ చిన్నపరెడ్డి, ప్యాపిలి మండల అధ్యక్షులు మాజీ మస్తాన్వలి, కార్యవర్గ సభ్యులు శివ పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షా సామాగ్రి పంపిణీ

విశాలాంధ్ర - చాగలమర్రి : పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, కస్తూర్భా గురుకుల పాఠశా లలో పదో తరగతి చదువు తున్న విద్యార్థినీలకు కడప జిల్లా దువ్వూరుకు చెందిన శ్రీ వినాయక ఫౌండేషన్ అధినేత డిటీ గోపాలకృష్ణ, చాగలమర్రి ఆర్యశ్రీ స్వచ్ఛంద సేవా సంస్థ టంగుటూరి రంజిత్‌కుమార్, దాత నారాయణ పవన్ కుమార్‌లు శుక్రవారం పరీక్షా సామాగ్రి పంపిణీ చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 50 మంది, కస్తూరి భా గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువు తున్న 40 మంది విద్యార్థినీలకు పరీక్షా అట్టలు, పెన్సిల్లు, పెన్నులను, స్కేళ్లను పంపిణీ చేయడం జరిగిందన్నారు. విద్యార్థులంతా క్రమశిక్షణతో చదివి ఉన్నతస్థాయికి చేరుకోవాలని తెలియజేసారు. కష్టపడి చదివి పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని కోరారు. హెచ్ఎం విజయలక్ష్మి, ఎస్ఓ సునీత, ఉపాధ్యాయినీలు పాల్గొన్నారు.

శివరాం థియేటర్ వద్ద పోలీస్ బందోబస్తు

విశాలాంధ్ర - బనగానపల్లె: హిందీలో విడుదలై రికార్డులు సృష్టిస్తున్న ఛావ సినిమా అల్లు అరవింద్ సారథ్యంలోని గీతా ఆర్ట్స్ పంపిణీదారు తెలుగులో డబ్ చేసి విడుదల చేసిన నేపథ్యంలో సినిమాలో మొగల్ చక్రవర్తి ఔరంగజేబు చరిత్రను వక్రీకరించి చిత్రీకరించారని ఒక వర్గం ఈ సినిమా విడుదల నిలుపుదల చేయాలని, లేని పక్షంలో ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరికలు జారీచేసిన నేపథ్యంలో శుక్రవారం బనగానపల్లె శివరాం థియేటర్ లో ప్రదర్శిస్తున్న థియేటర్ వద్ద పోలీసులు ముందస్తు బందోబస్తును ఏర్పాటు చేశారు. బనగానపల్లె సిఐ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ఎస్సై దుగ్గిరెడ్డి పోలీసు సిబ్బంది ఉదయం శివరాం థియేటర్ వద్ద బందోబస్తు నిర్వహించారు.

12న చలో విజయవాడ జయప్రదం చేయండి

విశాలాంధ్ర - కోవెలకుంట్ల : మండల పరిధిలోని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఉపాధి కూలీలు పనిచేసే చోటికి వెళ్లి ఈనెల 12న ఉపాధి కూలీల పెండింగ్ బిల్లులు ఇతర సమస్యలపై చలో విజయవాడ కార్య క్రమాన్ని జయప్రదం చేయాలని వారికి పిలుపునివ్వడం జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం సుధాకర్ మాట్లాడుతూ గత ఎనిమిది వారాలుగా ఉపాధి కూలీల బిల్లును పడక నానా అవస్థలు పడుతున్నారని కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం చాలా అన్యాయమని, పనిచేసే చోట తగిన సౌకర్యాలు కల్పించలేదని ఎండాకాలం వచ్చిన వారికి ఓఆర్ఎస్ ప్యాకెట్స్, టెంటు సౌకర్యం, మెడికల్ కిట్టు గాని లేవన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రాములమ్మ, సరోజ, శేఖర్, మహాలక్ష్మి, సుబ్బరాజు పాల్గొన్నారు.

నేషనల్ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : నేషనల్ డిగ్రీ కళాశాలలో మార్చి 9వ తేదీ ఆదివారం నేషనల్ డిగ్రీ కళాశాల నందు జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు నేషనల్ విద్యాసంస్థల అధినేత డా.ఎస్.ఇంతియాజ్ అహ్మద్ తెలిపారు. ఈ జాబ్ మేళా యందు హైదరాబాద్‌కు చెందిన వైఎస్‌కె ఇన్ఫోటెక్ లిమిటెడ్, ఫాక్సకాన్ ఇంటర్కనెక్ట్ టెక్నాలజీస్, జి.జె. సొల్యూషన్స్ సంస్థలు వివిధ ఉద్యోగాలకు ఎంపికలు నిర్వహిస్తాయని తెలిపారు.ఫోక్సకాన్ కంపెనీ ఇంటర్వ్యూ కు 18 నుండి 28 ఏళ్ల లోపు వయసు కలిగి పది, ఇంటర్, డిగ్రీ పాస్ లేక ఫెయిలయిన అమ్మాయిలు హాజరు కావచ్చని, ఎంపికైన వారికి నెలకు 13,652 జీతంతో పాటు ఉచిత రవాణా, వర్కింగ్ టైంలో ఉచిత భోజనం సౌకర్యం కల్పించబ డునన్నారు. జి.జె. సొల్యూషన్స్ లిమిటెడ్ కంపెనీలో ఇంటర్వ్యూకు 18 నుండి 28 ఏళ్లలోపు ఉన్న ఇంటర్, డిగ్రీ విద్యార్హత ఉన్న అభ్యర్థులు అర్హుల న్నారు. పైన తెలిపిన అర్హతలు కలిగి, ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 9వ తేదీ ఉదయం 9 గంటలకు శ్రీనివాసనగర్ లో ఉన్న నేషనల్ డిగ్రీ కళాశాలకు చేరుకోవాలన్నారు. అభ్యర్థులు తమ విద్యార్హతలకు సంబంధించిన జిరాక్స్ ధ్రువపత్రాలు, ఒరిజినల్ ఆధార్ కార్డు, 2 పాస్పోర్ట్ ఫోటోలను తీసుకు రావాలని, నంద్యాల, పరిసర ప్రాంతాలకు చెందిన నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డా.ఎస్.ఇంతియాజ్ అహ్మద్ అన్నారు.

మహిళలు సాధికారికత దిశగా అడుగులు వేయాలి

విశాలాంధ్ర - వెలుగోడు: పట్టణములోని స్థానిక వ్యవసాయ అధికారి కార్యా లయం నందు శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని మండల వ్యవ సాయ అధికారి పవన్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. వారు మాట్లాడుతూ ధైర్యం, సంకల్పం, దయ మహిళలకు ఉన్న ఈ గుణాలే ప్రపంచాన్ని ప్రకాశవంతం చేస్తున్నాయని, మహిళలు సాధించిన విజయాలు అభినందిం చేందుకు, లింగ సమానత్వం పై అవగాహన కల్పించేందుకు మహిళా దినో త్సవం జరుపుకోవాలని అన్నారు .2025 మహిళా దినోత్సవాన్ని ప్రతి మహి ళకూ, ప్రతి బాలికకూ హక్కులు, సమానత్వం, సాధికారత దిశగా అడుగులు వేయాలని వారు తెలిపారు. మహిళలే ఈ సృష్టికి మూల కారణమని వారి ఓర్పు, సహనం, కుటుంబ ఎదుగుదలతో వారి పాత్ర మహా గొప్పదని అన్నారు. మహిళలను గౌరవించే బాధ్యత ప్రతి పౌరుడిపై వుందని అన్నారు. అనంతరం వ్యవసాయ మహిళ సిబ్బందిని ఏఓ మోమెంటాతో సత్కరించారు. ఏఈఓలు సుధారాణి, అంజిత్ కుమార్ రెడ్డి అన్ని రైతు సేవ కేంద్రల సిబ్బంది పాల్గొన్నారు.

టీకాలు తప్పని సరి వేయించాలి

విశాలాంధ్ర- చాగలమర్రి: పశువులకు తప్పనిసరి గా గాలికుంటు నివారణ టీకాలు వేయించాలని ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు వర ప్రసాద్ తెలియజేసారు. శుక్రవారం మండలంలోని పెద్దబోధనం గ్రామంలో గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. 4 నెలలు పైబడిన అన్ని రకాల పశువులకు ఈ టీకాలు వేయించాలన్నారు. చాగలమర్రి, ఉయ్యాలవాడ మండలాల్లో దాదాపు 20 వేల పశువులున్నాయని ఇప్పటి వరకు సుమారు 5 వేల పశువులకు ఈ టీకాలు వేసామన్నారు.

పాత రెవెన్యూ రికార్డులు ఎక్కడ : వార్డు మెంబర్

విశాలాంధ్ర - శిరివెళ్ల: మండల కేంద్రానికి సంబం ధించిన పాత రెవెన్యూ రికార్డులు ఎవరి వద్ద ఉన్నాయో అధికారులు తేల్చలేకపోతున్నారని వార్డ్ మెంబర్ ముళ్ళ అన్వర్ అన్నారు. రెడ్డి, కరణం, వీఏవో లుగా గ్రామస్థాయి అధికారిగా విధులు నిర్వహించిన ఒక మాజీ గ్రామ రెవెన్యూ ఉద్యోగి తన వద్ద ఉన్న రికార్డులు తహశీల్దార్ కార్యాలయానికి అప్పజెప్ప కుండా మొండిగా వ్యవహరించడం వల్ల తదనంతరం తర్వాత వచ్చిన గ్రామస్థాయి రెవెన్యూ అధికారులకు అందుబాటులో లేకపోవడం వల్ల కొందరు సాధారణ మధ్యతరగతి పేద రైతులు రికార్డులు కోల్పోవాల్సి వచ్చిందని ముళ్ళ అన్వర్ పేర్కొన్నారు. ఓల్డ్ 10 వన్ అడంగల్, ఓల్డ్ ఆర్ఎస్ఆర్, ఓల్డ్ ఆర్ఓఆర్, ఓల్డ్ సంజాస్ వంటి రికార్డులు మండల రెవెన్యు కార్యాల యానికి, గ్రామ రెవెన్యూ కార్యాలయానికి అప్పగించ లేదని అధికారులే తెలిపారని అన్నారు. ఓల్డ్ రెవిన్యూ రికార్డులు లేకపోవడం వల్ల అనుభవ అడంగల్ లో భారీగా అవకతవకలు జరిగి అన్యాయానికి గురైన సంఘటనలు ఉన్నాయని ఈ సందర్భంగా వివరిం చారు. ఇప్పటికీ అనుభవంలో ఒకరు ఉంటే రికార్డుల్లో మరొకరు ఉండడం, విస్తీర్ణాలు తారు మారు కావడంవంటి సంఘటనలు శిరివెళ్లలో అధికంగా నెలకొని ఉన్నాయని అన్నారు. సంబంధిత మాజీ గ్రామ రెవెన్యూ కరణాన్ని మరొకసారి రికార్డులు అప్పగించా లంటూ సంజాయిసి కోరాలని ముళ్ల అన్వర్ అధికారులకు సూచించారు.

ఆంధ్రప్రదేశ్ జీవ నాడులను కాపాడాలి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : శ్రీశైలం జలాశయం ప్లంజ్ పూల్ వద్ద గొయ్యి సమస్య 1985 లో మొదలై అప్పట్లో భారీ వరదలకు ప్రాజెక్టు స్పిల్ వే గుండా ఉధ్రుతంగా వరద ప్రవహించడంతో ప్లంజ్ పూల్ ప్రాంతంలో రాతి నేల దెబ్బతిని అక్కడ భారీగా గుంత పడింది. దీనిని సత్వరమే పూర్తి చేసి శ్రీశైలం డ్యాంను కాపాడాలని అనేకసార్లు అధికారులకు విన్నవించినప్పటికీ మరమ్మతులకు నోచుకోలేక పోయారని ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి. సోమన్న ఆరోపించారు. దీనిపై కేంద్ర జల సంఘం సమీక్షించి తాత్కాలికంగా సిమెంట్ కాంక్రీట్ వేశారని, మళ్లీ 2009లో భారీ స్థాయిలో వరదలు రావడంతో అక్కడ 120 మీటర్ల లోతున భారీ గొయ్యి ఏర్పడిందని, ఆ గొయ్యి వెడల్పు 270 మీటర్లు కాగా పొడవు 400 మీటర్లు ఉందని, దీనివల్ల ప్రధాన డ్యామ్ కె.ముప్పు ఏర్పడు తుందని, మరమ్మతులు చేయాలంటూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, ప్రజాసంఘాలతో కలిసి విన్నవించినప్పటికీ ఫలితం లేక పోయింద న్నారు. శ్రీశైల డ్యాంలో ఏర్పడిన గొయ్యిని వెంటనే పూర్తి చేసెందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని లేనిపక్షంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రైతులతో, ప్రజా సంఘాలతో కలిసి జిల్లా నుండి పాదయాత్ర చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

పారిశుద్ధ కార్మికుల సేవలు విలువ కట్టలేనివి

విశాలాంధ్ర - బనగానపల్లె: పారిశుద్ధ కార్మికులు సేవలు విలువ కట్టలేనివని యాగంటి ఉమామహేశ్వర స్వామి ఈవో బి.చంద్రుడు యాగంటి పల్లె ఉపసర్పంచ్ బండి మౌళిశ్వర్ రెడ్డి అన్నారు. యాగంటి నందు శివరాత్రి బ్రహ్మోత్సవాలు సందర్భముగా పారుశుధ్య ఏర్పా ట్లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విజయవంతంగా చెసినందుకు యాగంటి దేవస్థానం ఈవో చంద్రుడు, యాగంటిపల్లి ఉప సర్పంచ్ బండి మౌలీశ్వర రెడ్డి బనగానపల్లె ఈవోపీఆర్డీ బి.సతీష్ కుమార్ రెడ్డి సన్మానం చేసి, ఉమా మహేశ్వర స్వామి చిత్రపటాన్ని అందజేశారు.

స్మశాన వాటిక స్థలం పరిశీలన : తహశీల్దార్

విశాలాంధ్ర - శిరివెళ్ల : మండల పరిధిలోని గుంపురమానుదిన్నె గ్రామంలో స్మశాన వాటికకై గ్రామస్తులు పెట్టుకున్న అర్జీ మేరకు స్థలం పరిశీలించినట్లు తాసిల్దార్ పుష్పకుమారి తెలిపారు. ఆర్ఐ రాఘవేంద్ర కుమార్ వీఆర్వో ఆధ్వర్యంలో స్థలాన్ని పరిశీలించి గ్రామస్తుల అభిప్రా యాన్ని సేకరించి నివేదికను తయారుచేసి జిల్లా కలెక్టర్ గారికి పంప నున్నట్లు తెలిపారు. శిరివెళ్ల గ్రామంలోని మాజీ కరణం పొజిషన్ సర్టిఫికెట్ కోసం పెట్టుకున్న అర్జీ మేరకు మాజీ కరణం సుబ్బారావు నివాసం వద్దకు విచారణ నిమిత్తం వెళ్లగా, ఆయన అందుబాటులో లేరని ఆర్ఐ రాఘవేంద్ర కుమార్, విఆర్ఓ భాస్కర్ రెడ్డి తెలిపారు. ఆర్ఐ మరియు వీఆర్వోల విచారణ రిపోర్టు వచ్చిన వెంటనే పొజిషన్ సర్టిఫికెట్ అర్జీపై తదుపరి ఆదేశాలు ఉంటాయని ఈ సందర్భంగా తహశీల్దార్ పుష్పకుమారి సూచించారు.

మహిళా దినోత్సవ వేడుకలను జయప్రదం చేయండి

విశాలాంధ్ర-అవుకు: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నంద్యాల పట్టణంలో జరగనున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను జయప్రదం చేయాలి అని ఏపీ జేఏసీ అమరావతి మహిళా విభాగం జిల్లా చైర్పర్సన్ విజయకుమారి అన్నారు. ఆమె మాట్లాడుతూ ఏపీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు నంద్యాల పట్టణంలోని రెవెన్యూ భవనం నందు జరుగుతున్న అంతర్జా తీయ మహిళా దినోత్సవ వేడుకలలో జిల్లాలోని నంద్యాల, డోన్, ఆత్మ కూరు డివిజన్లో పనిచేస్తున్న ప్రతి మహిళా ఉద్యోగి పాల్గొనాలన్నారు.

మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ

విశాలాంధ్ర - వెలుగోడు: వెలుగోడు మండలంలోని బీసీ, ఈ బీసీ, కమ్మ, రెడ్డి, క్షత్రియ, వైశ్య, బ్రాహ్మణ, కాపు వర్గాలకు చెందిన మహి ళలకు ఉచిత కుట్టు శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపీడీవో మధుసూదన్ రెడ్డి తెలిపారు. 18 సంవత్సరాల నుంచి 50 ఏళ్ల లోపు గల మహిళలు గ్రామ సచివాలయం నందు దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. శిక్షణ అనంతరం సేవా సహకార సంఘం వారు మహిళలకు కుట్టు మిషన్ పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో చెప్పారు.

నందవరం చౌడేశ్వరి అమ్మ వారికి పల్లకి సేవ

విశాలాంధ్ర - బనగానపల్లె: మండల పరిధిలోని నందవరం గ్రామంలో వెలిసిన చౌడేశ్వరి అమ్మవారి ఆలయంలో చౌడేశ్వరి అమ్మవారికి శుక్రవారం సందర్భంగా పల్లకి సేవ నిర్వ హించడం జరిగినది. ఆలయ కార్య నిర్వహణాధికారి కామేశ్వరమ్మ, అర్చ కులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ అభివృద్ధికి సహకరించండి

విశాలాంధ్ర- ఆళ్లగడ్డ: నియోజకవర్గం అభివృద్ధికి సహకరిం చాలని ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ మంత్రి నారా లోకేష్ ను కోరారు. శుక్రవారం అసెంబ్లీ అనంతరం ఎమ్మెల్యే అఖిలప్రియ మంత్రి నారా లోకేష్‌ను కలిసి ఆళ్లగడ్డకు సంబంధించి అభివృద్ధి గురించి మాట్లాడడం జరిగింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు ఆళ్లగడ్డ ప్రజలకు ప్రతి ఒక్కటి చేసి పెట్టాలని ముఖ్యంగా ఆళ్లగడ్డలో నిరుద్యోగ యువతీ యువకులు ఉండకూడదని ఆళ్లగడ్డకు ఇండస్ట్రీలు కావాలని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, ఐటీ మినిస్టర్ నారా లోకేష్‌ను కోరారు.

మరిన్ని వార్తలు E-PAPERలో...

విశాలాంధ్ర కర్నూలు
www.visalaandhra.com
కర్నూలు, శనివారం 08, మార్చి 2025

జిల్లా వ్యాప్తంగా జరిగే నిరసనలు జయప్రదం చేయండి : బి.గిడ్డయ్య

విశాలాంధ్ర బ్యూరో – కర్నూలు : బడ్జెట్లో కర్నూలు జిల్లాకు తీరని అన్యాయం జరిగింది సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య విమర్శించారు. శుక్రవారం సీఆర్ భవన్ నందు పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చిన వెంటనే సాగునీటి ప్రాజెక్టులు వేదవతి, ఆర్డీఎస్, గుండ్రేవుల, గురు రాఘవేంద్ర ప్రాజెక్టుకు నిధులు కేటాయించి పూర్తిచేసి కరువు వలసలు నివారిస్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్‌లో నిధులు కేటాయింపులు చేస్తారని జిల్లా ప్రజలు ఆశించినా సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించ కుండా అన్యాయం చేశారని విమర్శించారు. జిల్లాలో పశ్చిమ ప్రాంతం పూర్తిగా కరువు కాటకాలకు నిలయంగా మారి సాగునీరు, తాగునీరు దొరకక ప్రజలు అలమటిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో 13 జిల్లాల్లో సోషల్ ఎకనామిక్ సర్వే తెలిపిన నివేదికలో రాష్ట్రంలోనే అత్యధికంగా పేదరికం ఉన్న జిల్లాగా కర్నూలు జిల్లా నమోదు అయిందన్నారు. ఇటువంటి ప్రత్యేక పరిస్థితుల్లో జిల్లా అభివృద్ధికి,సాగునీటి ప్రాజెక్టులకు, నూతన పరిశ్రమల ఏర్పాటుకు అధిక నిధులు కేటాయించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరంఉందన్నారు. బడ్జెట్లో సాగునీటి ప్రాజెక్టులకు జిల్లా సమగ్ర అభివృద్ధికి 10 వేల కోట్ల రూపాయలు నిధులు కేటాయించి న్యాయం చేయాల్సిన అవసరం ఉందన్నారు. మార్చి 10వ తేదీన జిల్లా వ్యాప్తంగా సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించడం జరుగుతుందని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఐ శ్రేణులకు ప్రజలకు ఆయన పిలుపునిచ్చాడు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.జగన్నాథం, నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి, నగర సహాయ కార్యదర్శి మహేష్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సోమన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి పదిలో పాసవ్వాలి : జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో – కర్నూలు: ప్రతి విద్యార్థి పదవ తరగతిలో ప్రతి విద్యార్థి పాస్ కావాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా విద్యార్థులను ప్రోత్సహించారు. శుక్రవారం స్థానిక ఎస్ఏపీ క్యాంప్‌లోని నగర పాలక ఉన్నత పాఠశాలను సందర్శించి, మధ్యాహ్న భోజనం తనిఖీ చేయడం తో పాటు జిల్లా కలెక్టర్ ఉపాధ్యాయుడిగా మారి విద్యార్థులకు గణితం సులభంగా అర్థమయ్యే విధంగా టిప్స్ నేర్పించారు. మొదట కలెక్టర్ పదవ తరగతి గదిలో గణితం బోధిస్తున్న సబ్జెక్ట్ టీచర్ తో మాట్లాడారు. పదవ తరగతి విద్యార్థులు ఎంతమంది ఉన్నారు, ఎంతమంది హాజరయ్యారు, ఎంతమంది అయ్యారు అని కలెక్టర్ గణిత సబ్జెక్ట్ టీచర్ ని అడిగి తెలుసుకున్నారు.విద్యార్థులకు మ్యాథ్స్ సులువుగా అర్థం అయ్యేలా బోధించాలని కలెక్టర్ ఉపాధ్యాయులకు సూచించారు. గణితంలో ఒక సమస్యను తీసుకొని, ఏ విధంగా పరిష్కరించాలని కలెక్టర్ ఒక విద్యార్థితో పానెల్ బోర్డ్ మీద చేయించారు. అనంతరం కలెక్టర్ స్వయంగా పదవ తరగతి విద్యార్థులకు ఏ విధంగా గురుపెట్టుకోవాలో స్వయంగా విద్యార్థులకు బోధించారు. గణిత సమస్యలను పార్ట్‌లుగా విభజించుకుని, పరిష్కరించినట్లయితే సమాధానం చాలా బాగా గుర్తుంటుందని కలెక్టర్ విద్యార్థులకు సూచించారు. అనంతరం కలెక్టర్ పదో తరగతి విద్యార్థులతో ముచ్చటించారు. విద్యార్థి దశలో పదవ తరగతి చాలా కీలకమైన పాత్ర పోషిస్తుందని, అందరూ బాగా చదువుకుని పదో తరగతిలో మంచి మార్కులు సాధించాలని కలెక్టర్ విద్యార్థులను ప్రోత్సహించారు. ఇంటర్, బీటెక్ లేదా డిగ్రీలను కష్టపడి బాగా చదివి, మంచి ఉద్యోగం సాధించాలని కలెక్టర్ సూచించారు. తల్లిదండ్రులు ఎంతో కష్టపడి మిమ్మల్ని చదివిస్తున్నారని, సమయాన్ని వృధా చేసుకోకుండా కష్టపడి బాగా చదివి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. ప్రతి మూడో శనివారం నిర్వహిస్తున్న స్వచ్ఛతా దివస్ కార్యక్రమాల్లో భాగంగా పాఠశాల ఆవరణం మరింత పరిశుభ్రంగా ఉంచుకోవాలని కలెక్టర్ హెడ్మాస్టర్ ను ఆదేశించారు. పాఠశాలలో మినరల్ వాటర్ ప్లాంట్‌ను త్వరగా ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.

మధ్యాహ్న భోజనంను కలెక్టర్ తనిఖీ చేశారు: అన్నం వండడానికి ఫిల్టర్ వాటర్ ను వినియోగించాలని, అందువల్ల అన్నం నాణ్యతగా ఉంటుందని కలెక్టర్ హెడ్మాస్టర్‌ను ఆదేశించారు. గుడ్లను పరిశీలించి, గుడ్ల సైజు చిన్నగా ఉండడ్తి గుడ్లను సప్లై చేస్తున్న సంబంధిత ఏజెన్సీకి షోకాజ్ నోటీస్ ఇవ్వాలని కలెక్టర్ ఫోన్ చేసి డీఈఓను ఆదేశించారు.

నాగపట్నంలో ఏఐకెఎస్ జాతీయ మహాసభలు

విశాలాంధ్ర – కర్నూలు : ఏప్రిల్ 15,16,17వ తేదీలో తమిళనాడు రాష్ట్రంలోని నాగపట్నంలో జరుగు ఏఐకేఎస్ జాతీయ మహాసభలు జయప్రదం చేయాలని ఏపీ రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి కె జగన్నాథం ఓ ప్రకటనలో కోరారు. జాతీయ మహాసభల సందర్భంగా కర్నూలు జిల్లాలో పెద్దఎత్తున ఏఐకెఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించడం జరుగుతుదన్నారు. జాతీయ మహాసభలకు ఆంధ్ర రాష్ట్రం నుండి 50 మంది డెలిగేట్స్ హాజరవుతున్నామని తెలిపారు. రైతులకు ప్రభుత్వం గిట్టుబాటు ధరలు కల్పించకపోవడం ద్వారా అప్పుల్లో కూరుకుపోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి, నాణ్యమైన ఎరువులు, రసాయనిక మందులు, విత్తనాలు రైతులకు సకాలంలో సబ్సిడీతో అందచేయాలని కోరారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు పూర్తిచేసి వలసలను నివరించాలని కోరారు. 60 సం నిండిన ప్రతి రైతుకు నెలకు రూ.10 వేలు పింఛన్ ఇవ్వాలని కోరారు. రైతు భరోసా డబ్బులు ప్రతి రైతుకు రూ.20 వేలు తక్షణమే అకౌంట్లో జమ చేయాలని, లేనిపక్షంలో రైతుల ఆధ్వర్యంలో ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

పోక్సో చట్టంపై అవగాహన

విశాలాంధ్ర – కర్నూలు ఎడ్యుకేషన్: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి స్థానిక కట్టమంచి రామలింగారెడ్డి మెమోరియల్ మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాల, ఎస్ఏపీ క్యాంపు, కర్నూలు నందు మహిళా దినోత్సవం సందర్భంగా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి మాట్లడుతు మహిళల హక్కులు, సాధికారత, సమానత్వం కోసం మహిళలు చేసే పోరాటానికి సాంకేతంగా ఈ నెల 8న ప్రపంచ మహిళా దినోత్సవాన్ని జరుపు కుంటున్నామని తెలిపారు. సాంఘిక, రాజకీయ, సాంస్కృతిక కార్యక్రమాల్లో స్త్రీ, పురుషులు సమానమని చెప్పడమే ముఖ్య ఉద్దేశం అని తెలిపారు. అక్కడి పిల్లలకు పోక్సో యాక్ట్‌పై అవగాహన కల్పించారు. పిల్లలపై లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన శిక్షలు కలవని తెలిపారు. అనంతరం మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. అసిస్టెంట్ కమండెంట్ మహబూబ్ బాష, డాక్టర్ రాయపాటి శ్రీనివాసులు, పాఠశాల ప్రధానో పాధ్యా యులు వెంకట రెడ్డి, ఎం.సుగుణమ్మ, ఎ.మేరీ సరోజ, బి.లక్ష్మి దేవి, ఆర్ఎస్ చంద్రకళ దేవి, మంజుల రాణి, నాగలక్ష్మి, కుమార్, అధ్యాపక విద్యార్థి విద్యార్థినీలు పాల్గొన్నారు.

అంతా నా ఇష్టం..!

- అధికారి ఇష్టారాజ్యం.. సేవలలో నిర్లక్ష్యం..
- అధికారి తీరుపై మండిపడుతున్న రైతులు, ప్రజలు
- రిజిస్ట్రేషన్ సాఫీగా అవ్వాలంటే.. అదనంగా ముడుపులు ఇవ్వాల్సిందే.
- డాక్యుమెంట్ల కోసం రోజుల తరబడి తిరగాల్సిందే..!
- అయినవారికి ఆకుల్లో, కాని వారికి కంచాల్లో.. అన్నట్లుగా సేవలు
- ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని : సీపీఐ

విశాలాంధ్ర – కోడుమూరు: నియోజకవర్గ కేంద్రమైన కోడుమూరు సబ్ రిజిస్టర్ కార్యాలయంలో అధికారుల నిర్లక్ష్యంతో పాటు అవినీతి రాజ్యమేలుతోందని ఆరోపణలు ప్రజల నుంచి విపరీతంగా వినిపిస్తున్నాయి. ప్రజలకు డిజిటల్ సేవల ద్వారా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ కొనసాగుతున్నా, అధికారుల నిర్లక్ష్యం కారణంగా రోజుల తరబడి కాలం వృధా చేసుకుని రిజిస్టర్ లావాదేవీల కోసం రైతులు,ప్రజలు కార్యాలయం వద్ద పడిగాపులు కాయాల్సి వస్తుంది. బదిలీపై కొత్తగా అధికారి వచ్చినప్పటి నుంచి ప్రజలకు సకాలంలో సేవలను అందించకుండా, ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ కాలయాపన చేయడం పట్ల రైతులు,ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.ప్రజలకు అందించాల్సిన సేవలలో ఈసీ మొదలుకొని ఆర్ హెచ్ పేజీలు,రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు, మార్కెట్ వేల్యూవేషన్ సర్టిఫికెట్స్ ఇలా ఎటువంటి సేవలు కావాలన్నా వారు కోరినంత ముట్ట చెప్పాల్సిందేనని, అడిగినంత ఇచ్చిన వారికి మాత్రమే సకాలంలో జరిగిపోతున్నాయని విమర్శలు గుప్పమంటున్నాయి. అడిగినంత ముట్ట చెప్పకపోతే సర్వర్ సమస్య పేరుతో రోజులు తరబడి కార్యాలయం చుట్టూ తిప్పుతున్నారని పలువురు బాధితులు వాపోతున్నారు. ఏమిటిదని ఎవరైనా ప్రశ్నిస్తే సర్వర్ పనిచేయడం లేదని, మేమేం చేసేదని పెడసరిగా సమాధానం ఇస్తూ,ఎదురు ప్రశ్నిస్తున్నట్లుగా తెలుస్తోంది. అంతా నా ఇష్టం, అంతా మా ఇష్టం అన్న రీతిలో నిత్యం ప్రజలకు అందించే సేవల్లో అధికారి, సిబ్బందితో సహా అదే రీతిగా వ్యవహరిస్తున్నారు.

ఒక్కో సేవకు ఒక్కో రేటు: కోడుమూరు సబ్ రిజిస్టర్ కార్యాలయం పరిధిలో కోడుమూరు, దేవనకొండ, గోనెగండ్ల, క్రిష్ణగిరి, మండలాలకు చెందిన దాదాపు 42 గ్రామాలు ఉన్నాయి. నెలకు ఇంచుమించు సుమారు 600 నుంచి వెయ్యి వరకు రిజిస్ట్రేషన్లు జరుగుతాయి ఏడాదికి దాదాపు కోట్లలో ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుందని అంచనా.రిజిస్ట్రేషన్ నిబంధనలు మేరకు మార్కెట్ విలువలో 7.5శాతం వసూలు చేయాల్సి ఉండగా, సదరు అధికారి మధ్య దళారులను పెట్టుకుని ఒకటిన్నర శాతం అదనంగా వసూలు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఈసీ కావాలంటే ఒక రేటు, ఆర్‌హెచ్ పేజీకి ఇంకో రేటు, ఇలా ఇష్టం వచ్చినంత ప్రజల నుంచి వసూలు చేస్తున్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక్కో సేవకు ఒక్కో రేటు నిర్ణయించినట్లు వినికిడి.ప్రజలనుంచి అందిన కాడికి దోచుకుంటున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రజల నుంచి మాకు అత్యవసర సేవలు కావాలని వస్తే, వారి అవసరాన్ని బట్టి రేటు మారుతుందన్నట్లు చెబుతున్నారు. అడిగినంత ఇవ్వకుంటే, ఏదో విధంగా కొర్రీలు పెడుతూ రోజుల తరబడి తిప్పుకుంటున్నట్లు విమర్శలు కూడా వినిపిస్తున్నాయి.

అయినవారికి ఆకుల్లో కాని వారికి కంచాల్లో : కోడుమూరు సబ్ రిజిస్టర్ కార్యాలయం పరిధిలో దాదాపుగా 10డాక్యుమెంట్ రైటర్ల దుకాణాలు ఉన్నాయి. వీరిలో కొందరికి సేవలు అందించడంలో సదరు అధికారి అయిన వారికి ఆకుల్లో, కాని వారికి కంచాల్లో అన్న చందంగా వ్యవహరిస్తూ అందిన కాటికి దండుకుంటున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. డాక్యుమెంట్ రైటర్ల విషయంలోనే కాకుండా రిజిస్ట్రేషన్ సేవల కోసం వచ్చే ప్రజలు,రైతులకు అందించే సేవలలో సైతం ఆమె తీరు ఇలానే కొనసాగు తుంది. అయినవారు.. అంటే అంతో ఇంతో కాస్త దాబుసరిగా ఉన్నవారు వస్తే వారికి పక్కన కుర్చీలు వేసి సకల మర్యాదలు చేయడం,కాని వారు అంటే సాదాసీదగా వస్తే కూర్చునేందుకు ఆమె ముందు కుర్చీలు కూడా ఉండవు. కానీ రాష్ట్ర ప్రభుత్వం రిజిస్టర్ కార్యాలయాల్లో ప్రజలకు సకల సౌకర్యాలు కల్పించాలని సబ్ రిజిస్టర్ అధికారులకు ఉన్న ప్రత్యేక క్యాబిన్లను తొలగించి సాదాసీదాగా ప్రజలతో మమేకమై వారికి కుర్చీలు ఏర్పాటు చేసి వారి పట్ల గౌరవభావంతో వ్యవహరించాలని ఆదేశాలు ఇస్తోంది. మరి ఇలాంటి కార్యాలయాల్లో అలాంటి ఆదేశాలకు చోటు లేదా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

డాక్యుమెంట్స్ ఇవ్వడంలోనూ అలసత్వమే : రిజిస్ట్రేషన్ కోసం ఎన్నో ఆపసోపాలు పడి, అయినవారి దగ్గర కాని వారి వద్ద అప్పుచేసి ప్రభుత్వం నిర్ణయించిన మేరకు స్టాంప్ డ్యూటీ తోపాటు రైటర్స్ అడిగినంత చెల్లించి, రిజిస్ట్రేషన్ చేయించుకుంటే డాక్యుమెంటు ఇచ్చే సమయంలో సిబ్బంది ప్రజలను ఇబ్బందుల గురిచేస్తూ రోజులకు తరబడి తిప్పుకుంటున్నట్లు కొందరు కొనుగోలుదారులు ఆరోపిస్తున్నారు. ఇల్లు, పొలము, ప్లాట్లు వంటివి కొనుగోలు చేసిన వారు రిజిస్టర్ సమయం లోనే కాకుండా డాక్యుమెంట్ ఇచ్చే సమయంలో కూడా ఎంతో కొంత ముట్టజెప్పాల్సిన పరిస్థితి ఉన్నట్లు తెలుస్తోంది.రి జిస్ట్రేషన్ పూర్తయిన మరుసటి రోజున డాక్యుమెంట్ ఇవ్వాల్సిన నిబంధనలు పాటించకుండా రోజుల తరబడి తిప్పుకుంటు న్నారని పలువురు వాపోతున్నారు.

సేవల్లో అధికారుల నిర్లక్ష్యం – సీపీఐ మండల కార్యదర్శి రాజు: రిజిస్ట్రేషన్ సేవలు అందించడంలో అధికారుల నిర్లక్ష్యం కళ్లకు కట్టినట్లుగా కనిపిస్తుందని,రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన ప్రజలను అధికారులు తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారని సిపిఐ మండల కార్యదర్శి రాజు అన్నారు. ప్రజలు భూములు,ఇల్లు,ప్లాట్లు కొనుగోలుచేసి రిజిస్ట్రేషన్ కోసం కార్యాలయానికి రావాలంటే భయపడాల్సి వస్తుంది. ప్రతిరోజూ వివిధ గ్రామాల నుంచి ఎంతోమంది రైతులు, ప్రజలు నిత్యం ఉదయం నుంచి సాయంత్రం వరకూ కార్యాలయం వద్ద పడిగాపులు కాయాల్సిందే.నిర్ణీత సమయంలో రిజిస్ట్రేషన్ జరిగిన దాఖలాలు ఇటీవల కాలంలో లేవు. కనీసం రెండు మూడు రోజులు రిజిస్టర్ కార్యాలయం చుట్టూ తిరిగితే కానీ పనులు పూర్తికాని పరిస్థితి నెలకొందని ఆయన విమర్శించారు. రిజిస్టర్ కార్యాలయంలో అధికారుల నిర్లక్ష్యం తంతుపై విచారణ జరిపించి వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

రోజుల తరబడి తిరిగిన పనులు కావడం లేదు – రైతు లక్ష్మన్న, బేతపల్లె: రిజిస్టర్ అయ్యేందుకు అన్ని డాక్యుమెంట్లు సరిగా ఉన్నాయి,అయినా కూడా రోజుల తరబడి తిరగాల్సి వస్తుందని, వేరే చోట్ల రిజిస్టర్లు బాగానే అవుతున్నాయని బేతపల్లె లక్ష్మణ అన్నారు.ఇక్కడే ఇలాంటి పరిస్థితులు చూస్తున్నాం. ఈ అధికారి వచ్చినప్పటి నుంచి సరిగా కావడం లేదని చెప్తున్నారు.ఇక్కడ త్రాగే నీళ్లు వచ్చిన ప్రజలకు కనీస సౌకర్యాలు కూడా లేవు.పొలం పనులు వదిలిపెట్టి వచ్చాము.కానీ ఇక్కడ పరిస్థితి చూస్తే రైటర్లు ఈ అధికారి వచ్చినప్పటి నుంచి ఇదే పరిస్థితి.. రిజిస్టర్ ఆలస్యం అవుతుంది అంటున్నారు, ఏమిటో ఆలస్యం ఎందుకు జరుగుతుందో మాకైతే అర్థం కావడం లేదు.

రిజిస్టర్ ఆఫీస్‌లో సేవలపై జిల్లా రిజిస్టర్ ను వివరణ కోరేందుకు ఫోన్లో సంప్రదించగా సెలవులో ఉన్నట్లు తెలిసింది. వచ్చే ఫోన్లో ఎవరు అందుబాటులోకి రాలేదు. ఏది ఏమైనా కోడుమూరు సబ్ రిజిస్టర్ కార్యాలయం సమస్యపై జిల్లాస్థాయి ఉన్నతాధికారులు స్పందించి ప్రజలకు అందించాల్సిన సేవలపై సబ్ రిజిస్టర్ అధికారుల నిర్లక్ష్యంపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సిపిఐ పార్టీ నాయకులు, ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.అలాగే ప్రజలకు కనీస సదుపాయాలు కల్పించి, సకాలంలో సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై ఉన్నతాధికారులు ఏవిధంగా స్పందిస్తారో వేచి చూడాల్సిందే.. మరీ!

ఇంటర్ సెకండియర్‌లో 414 గైర్హాజరు

విశాలాంధ్ర – కర్నూలు ఎడ్యుకేషన్: జిల్లా వ్యాప్తంగా సెకండ్ ఇయర్ ఇంటర్మీడియట్ పరీక్షలు రాయడానికి 21302 విద్యార్థులుగాను పరీక్షలు రాయడానికి 20864 విద్యార్థి విద్యార్థులు ఆర్ఐఓ గురువయ్య శెట్టి హాజరయ్యారని వారు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాల్ ప్రాక్టీస్ రెండు కేసులు నమోదు గవర్న మెంట్ వోకేషనల్ జూనియర్ కాలేజ్ బీకాంలో అయినట్లు వారు తెలిపారు. ఓపెన్ ఇంటర్మీడియట్ పరీక్షలు మూడో రోజుకు 1331 మంది విద్యార్థిని, విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 1180 మంది విద్యార్థిని, విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా, 151 మంది గైర్హాజరైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్ సామెల్ పాల్ తెలిపారు.

విద్యార్థినిపై ఆకతాయిలు దాడి



విశాలాంధ్ర – నందవరం: ముగతి గ్రామంలో పట్టపగలు నడిరోడ్డుపై 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని ఏంజెల్ (14)పై ఇద్దరు గుర్తు తెలియని ఆకతాయిలు దాడి చేసిన సంఘటన శుక్రవారం వెలుగు వచ్చింది. విద్యార్థిని తెలిపిన వివరాల ప్రకారం గురువారం మధ్యాహ్నం సమయంలో ఎమ్మిగనూరులో గర్ల్స్ హైస్కూల్ చదువు తున్న కోవడానికీ స్కూలుకు వెళ్లటానికి రోడ్డుపై బస్సు కోసం నిలబడి ఉండగా, ఎమ్మిగనూరు వైపు నుండి బైకుపైన వచ్చిన ఇద్దరు వ్యక్తులు అమ్మాయి నిలుచున్న ప్రదేశంలో బైకును ఆపి ఆమెను బైకు ఎక్కవల సిందిగా బెదిరించడం జరిగిందనీ, ఆమె నిరాకరించడంతో ఆమెపైన ఇద్దరు భౌతికదాడి చేయడంతో భయపడి గట్టిగా కేకలు వేయడంతో పక్కన ఇంటిలో ఉన్న మహిళ బయటికి రావడం జరిగింది. అప్పుడు ఆ వ్యక్తులు నందవరం వైపు పరారయ్యారని, ఆ దాడితో ప్రాణ భయంతో స్కూల్‌కి వెళ్లకుండా ఏడుస్తు ఇంటికి వెళ్లానని విద్యార్థిని తెలిపింది. ఆకతాయిల దాడిలో అమ్మాయి భయాందోళనకు గురైం దని, విద్యార్థిని మామ ఈరన్న తెలిపారు. విద్యార్థిని తండ్రి హను మంతు, తల్లి సత్యమ్మ వలస వెళ్లడం జరిగిందని, దాడి జరగడంతో పాప భయపడి ఇంటికి ఏడ్చుకుంటూ వచ్చిందని వాళ్ళ అవ్వ, తాత తెలిపారు. ఇలాంటి సంఘటనలు పురావృతం కాకుండా విద్యార్థినిల రక్షణ కోసం పోలీసులు గట్టి నిఘను ఏర్పాటు చేయాలని ఎస్సైకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సీసీటీవీలో ఆధారంగా ఆకతాయిలను పట్టుకొని కేసు నమోదు చేయాలన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

విశాలాంధ్ర – పెద్దకడబూరు: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉమా రాజేశ్వరమ్మ అన్నారు శుక్రవారం మండల కేంద్రమైన పెద్దకడబూరులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు అంతర్జాతీయ మహిళల దినోత్సవ వేడుకలు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉమా రాజేశ్వరమ్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా ఉపాధ్యానీయులను, ఆయాలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వీరేష్, శ్రీనివాసులు, విజయ్, సురేష్ కుమార్, మల్లికార్జున, రాఘవేంద్రరావు, హసన్, బసవరాజు, రాజేష్, నిసార్ బాష, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఆటల పోటీలు

విశాలాంధ్ర – కర్నూలు : అంతర్జాతీయ మహిళా దిన వారోత్సవాల సందర్భంగా కర్నూల్ పంప్ హౌస్ ఎదురుగా ఉన్న రాయలసీమ మహిళా సంఘ్ ఆధ్వర్యంలో మహిళలకు ఆటల పోటీలు నిర్వహించారు. రాయలసీమ మహిళా సంఘ్ వ్యవస్థాపక అధ్యక్షురాలు రాయలసీమ శకుంతల మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లోనూ ముందుండాలని, మహిళలకు మానసిక వికాసం చాలా అవసరం అన్నారు. చాలామంది మహిళలు ఇంటి నుంచి బయటకి రావడానికి కూడా భయపడుతుంటారు. రాయలసీమ మహిళా సంఘ్ ఆధ్వర్యంలో మహిళలకు కబాడీ మ్యూజికల్ చైర్స్, సాంగ్స్ పోటీలు నిర్వహించడం జరిగింది.

బదిలీపై వెళుతున్న వైద్యాధికారులకు ఘన సన్మానం

విశాలాంధ్ర – తుగ్గలి: వైద్యో నారాయణ అంటారు పెద్దలు సేవలన్నింటిలోను మానవసేవ గొప్పది అలాంటి మానవసేవ చేసే అదృష్టం ఒక్క వైద్య బృందానికే దక్కుతుంది అనడంలో అతిశయోక్తి లేదు. అలాంటి వైద్య సేవలో విదులు నిర్వహిస్తూ ఉన్న డా ప్రవీణ్ కుమార్ ఇక్కడ ఉన్నంగానే డా ప్రణతి ని వివాహం చేసుకోవడమే కాక భార్య భర్తలు ఇద్దరూ ఇక్కడే విదులు నిర్వహించి ఒకేసారి బదిలీ పై వెళ్లడంతో వైద్య సిబ్బంది కన్నీటి పర్యంతమయ్యారు. కరోనా సమయంలో పై అధికారులు ఎన్ని ఒత్తిళ్ల చేసినా అందుకు సిబ్బందికి ఎంతో సహరించారు. భార్యా భర్తలు ఇరువురు ఎక్కడ విదులు నిర్వహించినా తమ మనసుల్లోనే ఉంటారని వైద్య సిబ్బంది అన్నారు. బదిలీపై వెళుతున్నారన్న బాధ ఒకవైపు ఉన్నా తప్పని పరిస్థితుల్లో వీడ్కోలు పలకక తప్పదని అందుకు వైద్య సిబ్బంది డా ప్రవీణ్ కుమార్, డా.ప్రణతికి ఘనంగా సన్మానం చేసి వీడ్కోలు పలికారు.

ప్రమాదశాత్తు పొలాల్లో అగ్ని ప్రమాదం

విశాలాంధ్ర – వెల్దుర్తి: మండల పరిధిలోని సూదేపల్లె గ్రామానికి చెందిన రైతుల పొలాల్లో శుక్రవారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం సంభవించి నష్టాన్ని మిగిల్చింది. గ్రామానికి చెందిన రమణారెడ్డి, పుల్లారెడ్డి, భూమిరెడ్డి పొలాలు హైవే నుంచి గ్రామానికి వచ్చే దారిలో రైల్వే గేట్ల సమీపంలో రహదారి అటు, ఇటు ఉన్నాయి. అటు,ఇటు పొలాల్లో అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో గమనించిన రైతులు,చుట్టుప్రక్కల వారు మంటలనార్పే ప్రయత్నం చేశారు. చేతకాక డోన్‌అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. అంతలోగా రమణారెడ్డి పొలంలోని మునగపంట, డ్రిప్ పరికరాలు, మోటార్లు, స్టార్టర్ బాక్సులుఅగ్నికి ఆహుతయ్యాయి. పుల్లారెడ్డి, భూమిరెడ్డి సోదరుల పొలంలోని మూడు ట్రాక్టర్ల సొప్ప, ఒక ట్రాక్టరు వరిగడ్డితో కూడిన గడ్డివాము, రెండు మోటార్లు, ట్రాన్స్ఫార్మర్, విద్యుత్ వైరు కాలిపోయాయి. సంఘటనాస్థలికి చేరుకున్న డోన్ అగ్నిమాపక కేంద్రం స్టేషన్ ఫైర్ ఆఫీసర్ రంగస్వామి గౌడ్ తనసిబ్బందితో కలిసి మంటలను పూర్తిగా ఆర్పేశారు. దాదాపు రూ.3లక్షల ఆస్తి నష్టం సంభవించినట్లు బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అగ్ని ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

రీసర్వే డిప్యూటీ తహశీల్దార్‌గా లలిత కుమారి

విశాలాంధ్ర – పెద్దకడబూరు : పెద్దకడబూరు మండల రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ గా లలిత కుమారి శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో భాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నౌలేకల్ గ్రామం రీసర్వే పైలెట్ ప్రాజెక్టుకు ఎంపికైందని, రీసర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహిస్తామని తెలిపారు. అలాగే గతంలో భూ రీసర్వేలో జరిగిన పొరపాట్లను ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆమె వెల్లడించారు.

దొంగను పోలీసులకు అప్పగింత ప్రజలు

విశాలాంధ్ర – ఆదోని క్రైం: ఆదోని శివారు ప్రాంతం సాదాపురం గ్రామపంచాయతీ పరిధిలోని వైపీఆర్ కాలనీలో శుక్రవారం పట్టపగలు ఓ ఇంట్లో దొంగతనానికి పాల్పడిన దొంగ మోయిన్‌ను కాలనీవాసులు పట్టుకొని, చెట్టుకు కట్టేసి పోలీసులకు అప్పగించారు. కాలనీవాసులు తెలిపిన వివరాల మేరకు వైపీఆర్ కాలనీలో నివాసం ఉండే గూళ్యం రమేష్ కుమారుడికి ఆసుపత్రి నిమిత్తం ఇంటికి తాళాలు వేసి వెళ్లారు. మధ్యాహ్న సమయంలో ఇంట్లో ఎవరు లేని సమయంలో దొంగ ఇంటి తాళాలు తీసి బీరువాలో ఉన్న ఏడు తులాల బంగారు, ఐదు తులాల వెండి తీసుకొని వెళుతుండగా కాలనీ యువకులు వెంబడించి దొంగకు దేహశుద్ధి చేసి, దొంగను చెట్టుకు కట్టివేసి తాలూకా పోలీసులకు సమాచారం అందించారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలపై 11న చలో విజయవాడ

విశాలాంధ్ర– కర్నూలు సిటీ: ఏఐటీయూసీ అనుబంధ సంఘం ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సమితి మార్చి 11న తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమానికి మున్సిపల్ పారిశుధ్య కార్మిక, ఉద్యోగులు పర్మినెంట్ ఆప్కాస్, స్పెషల్ శానిటేషన్, టాయిలెట్ వర్కర్స్ ఇంజనీరింగ్ సిబ్బంది, స్కూల్ స్లిప్పర్స్ తదితరులు తరలి రావాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మునెప్ప పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పులగం మద్దిలేటి అధ్యక్షతన సమావేశం జరిగింది. సందర్భంగా ఎస్.మునెప్ప, పులగం మద్దిలేటిలు మాట్లడుతూ కాంట్రాక్టు, అవుట్సోర్సింగ్ పారిశుధ్య కార్మికులను క్రమబద్ధికరిం చాలని డిమాండ్ చేశారు. మునిసిపల్ కాంట్రాక్టు, అవుట్సోర్సింగ్ కార్మికుల వేతనాల చెల్లింపులు మునిసిపల్ శాఖ నుండే చెల్లించాలని, కార్మికులకు సాంఘీక భద్రత కల్పించాలన్నారు. కనీసవేతనం రూ.36 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నగర కార్యదర్శి జి.చంద్రశేఖర్, డిప్యూటీ కార్యదర్శి రామాంజనేయులు, మునిసిపల్ నాయకులు కె.చిన్న అయ్యరాజు, సవారి, నాగేంద్ర, మాణిక్యం, వెంకటేశ్వర్లు, గణేష్, షౌకత్, మహేష్, అమర్నాథ్, లక్ష్మీనారాయణ, సతీష్, బాబు, వెంకటేశ్వరరావులు పాల్గొన్నారు.

వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలి

విశాలాంధ్ర-పత్తికొండ: వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చా లని ఆంధ్రప్రదేశ్ వాల్మీకి బోయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి క్రాంతి నాయుడు డిమాండ్ చేశారు. శుక్రవారం అసెంబ్లీ ఆవరణంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును మర్యాద పూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. 2017 లో తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో సత్యపాల్ కమిటీ నివేదిక, కారెం శివాజీ ఎస్సీ, ఎస్టీ కమిషన్ నివేదికల ఆధారంగా అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగం మద్దతుతో తీర్మానాన్ని ఆమోదించి కేంద్రానికి పంపడం జరిగిందని తెలిపారు. ప్రస్తుతం కేంద్రంలో, రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నందున సమస్య పరిష్కారానికి కృషి చేసి, వాల్మీకి బోయలకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర డైరెక్టర్ బాబు నాయుడు, బైటప్ప నాయుడు, చంద్ర, గోపాల్ సీఎంను కలిశారు.

ఎక్కడా.. నీటి సమస్య తలెత్తకూడదు

విశాలాంధ్ర బ్యూరో – కర్నూలు: వేసవి కాలంలో జిల్లాలో ఎక్కడా నీటి సమస్య తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా కర్నూలు నగరపాలక సంస్థ ఎస్‌ఈని ఆదేశించారు. శుక్రవారం నగర శివార్లలోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌ను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ ఎన్ని ఎకరాల విస్తీర్ణంలో ఉంది, సుంకేసుల నుండి నీటిని డ్రా చేసుకుంటున్నారా, సుంకేసులలో ఎన్ని టీఎంసీల నీటి లభ్యత ఉంది, నీటి ఎద్దడి లేకుండా తగినంత నీరు ఉందా అని కలెక్టర్ కర్నూలు నగరపాలక సంస్థ ఎస్‌ఈని ఆరా తీశారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ 200 ఎకరాల విస్తీర్ణంలో ఉందని, ప్రస్తుతానికి సుంకేసులలో 0.8 టీఎంసిల నీటి లభ్యత ఉందని, సుంకేసుల నుండి నీటిని డ్రా చేసుకుంటు న్నామని కర్నూలు నగరపాలక సంస్థ ఎస్‌ఈ కలెక్టర్‌కి వివరించారు. నీటి సమస్య ఏర్పడకుండా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ అధికారులను ఆదేశిం చారు. కర్నూలు నగరపాలక సంస్థ ఎస్‌ఈ రాజశేఖర్, ఈఈ శేషసాయి, డిఈ నరేష్, డిఈ మనోహర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నగరాభివృద్ధికి ప్రజలు తోడ్పాటు అందించాలి

విశాలాంధ్ర – కర్నూలు సిటీ: కర్నూలు నగర అభివృద్ధికి ప్రజలు తోడ్పాటు అందించాలని, సకాలంలో పన్నులు చెల్లించాలని నగరపాలక అదనపు కమిషనర్ ఆర్జీవీ క్రిష్ణ కోరారు. శుక్రవారం ఆయన స్థానిక పెద్దపాడు రోడ్డులోని ఆల్ ఇండియా రేడియో స్టేషన్లో ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి, నీటి పన్నులను జాప్యం చేయకుండా ప్రజలు సకాలంలో చెల్లించడం ద్వారానే నగరాభివృద్ధి సాధ్యం అవుతుందన్నారు. ట్రేడ్ లైసెన్స్‌లను దుకాణదారులు తక్షణమే పునరుద్ధరణ చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, తద్వారా స్వచ్ఛత పట్ల ప్రజలకు చైతన్యం కల్పిస్తున్నామన్నారు. నగరంలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ) సర్వే, పబ్లిక్, ప్రైవేట్, పీపుల్ పార్టనర్షిప్ (పీ4) సర్వే, వర్క్ ఫ్రం హోం సర్వేలు పక్కా పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కాగా అదనపు కమిషనర్ ఇచ్చిన పూర్తి ఇంటర్వ్యూను శనివారం ఉదయం 09:30 గంటలకు, రాత్రి 08:30 గంటలకు, ఆదివారం ఉదయం 07:15 గంటలకు, రాత్రి 8 గంటలకు ప్రసారం అవుతుందని, నగర ప్రజలు రేడియో ద్వారా పథకాల ఉద్దేశ వివరాలను విని తెలుసుకోచ్చని సూచించారు.

మరిన్ని వార్తలు E-PAPERలో..

విశాలాంధ్ర కర్నూలు/నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, శనివారం 08, మార్చి 2025

ఆరోగ్యమే మహిళా శక్తికి మూలాధారం : కిమ్స్ డా.వై.కుసుమ

విశాలాంధ్ర బ్యూరో – కర్నూలు : ఆరోగ్యమే మహిళా శక్తికి మూలాధారం, మహిళలు కుటుంబాన్ని, సమాజాన్ని పటిష్ఠంగా నిలబెట్టే శక్తి ఉటుందని, ప్రతి దశలోనూ బాలికలు, మహిళలకు కొన్ని ప్రత్యేకమైన అవసరాలు, అవకాశాలు ఉంటాయి. వాటిద్వారా వాళ్లు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కిమ్స్ వైద్యశాల గైన కాలజిస్టు డాక్టర్ కుసుమ తెలిపారు. నేడు ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా ఆమె మహిళల ఆరోగ్యంపై వివరించారు. బాల్యం, కౌమారం, పిల్లలు పుట్టే వయసు, మెనోపాజ్, ఆ తర్వాతి దశల్లో మహిళలు తమ ఆరోగ్యాన్ని సంరక్షించు కోవాలన్నారు. నిత్యం ఎన్నో పనులతో సతమతమవుతూ తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారు మహిళలు. ఐటి రంగాల్లో పని చేస్తే స్త్రీలు కూడా తమ ఆరోగ్యానికి తక్కువ సమయం కేటాయిస్తున్నారు. ఇటీవల కాలంలో తమ దగ్గరికి వివిధ రకాల సమస్యలతో వచ్చిన వారిలో గృహిణీలతో పోలిస్తే ఉద్యోగాలు చేసే వారే ఎక్కువ మంది ఉన్నారని తెలిపారు. మారుతున్న జీవనశైలిలో ఆహారపు అలవాట్లు తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. ముఖ్యంగా ఐటీ సెక్టార్లలో పని చేసే వారు ఎక్కువ సేపు కూర్చున్న సీటుకే పరిమితం కావడం, అక్కడి కార్యాల యాల్లో అందు బాటులో ఉండే జంక్ ఫుడ్, ఫాస్ట్ ఫుడ్స్ తినడం, తగినంత శారీరక శ్రమ లేకపోవడం వల్ల అనేక రకాల సమస్యలు తలె త్తుతున్నాయి. మహిళల్లో ప్రధానంగా పిల్లలు లేకపోవ డం, రుతుక్రమం సరిగా రాకపోవడం, గర్భశాయ సమస్యలు, ఎక్కువసేపు నిలబడలేకపోవడం, నడవలేక పోవడం, ఒళ్లు నొప్పులు వంటివి ప్రధానంగా నేటి మహిళలు ఎదుర్కొంటు న్నారని తెలిపారు. యుక్తవయస్సులో ఆరోగ్యాన్ని కాపాడుకోవడం అనేది అవగాహన, జ్ఞానం, ప్రవర్తనలపై ఆధారపడి ఉంటుంది. బాలికల రుతుక్రమ ఆరోగ్యం, పరిశుభ్రతపై అవగా హన కల్పించడం చాలా ముఖ్యం. పీరియడ్స్ సమయంలో అధిక రక్తస్రావం వల్ల రక్తహీనతను నివారించడంపై కూడా దృష్టి పెట్టాలన్నారు. కౌమార దశలో మహిళల పునరుత్పత్తి, లైంగిక ఆరోగ్యంపై అవగాహన కల్పించాలి. కౌమారదశలో ఉన్నవారు ఆసక్తిగా ఉన్నప్పుడు, వారి హార్మోన్లు పెరుగుతున్నప్పుడు ఇంటర్నెట్ లో పుష్కలంగా సమాచారం అందుబాటులో ఉందన్నారు. పిల్లలు పుట్టే వయసు యువతుల్లో చాలామంది ఉద్యోగాలు, వ్యాపారాలు చేసుకుంటున్నారు. దానివల్ల 30 ఏళ్లు దాటిన కూడా పెళ్లి చేసుకోవడం లేదు. దానివల్ల పిల్లలు పుట్టడం ఆలస్యం అవుతోంది. నిజానికి ఇలాంటి పరిస్థితుల్లో వారు కోరుకున్నప్పుడు పిల్లలు పుట్టరు. అది మానసిక, శారీరక ఒత్తిడికి దారితీస్తుందన్నారు. మహిళల్లో ఉండే ఈస్ట్రోజన్ అనే హార్మోన్, వారు 45 ఏళ్ల వయసు సమీపించేకొద్దీ క్రమంగా తగ్గడం మొదలవుతుంది. మెనోపాజ్ దశకు వచ్చేసరికి అది పూర్తిగా పోతుంది. దానివల్ల వారికి మానసిక, భావోద్వేగ పరమైన, శారీరక సమస్యలు వస్తాయి.హార్మోన్ రీప్లేస్‌మెంట్, కాల్షియం, విటమిన్ డి తీసుకోవడం, శారీరక కార్యకలాపాలు, మంచి పోషకాహారం తీసుకోవడం వల్ల ఆ తర్వాత కూడా మరో 20–25 ఏళ్లు చాలా చురుగ్గా ఉంటారు. ఇలా చేయడం వల్ల ఆస్టియోపోరోసిస్, కేన్సర్లు, మధుమేహం, గుండె కవాటాల వ్యాధులను నివారించవచ్చు.మీ ఆరోగ్యం, మీ శక్తి, మీ భవిష్యత్తు ఈ మహిళా దినోత్సవాన్ని సొంత ఆరోగ్యాన్ని, శ్రేయస్సును కాపాడుకునే శుభసందర్భంగా మార్చుకుందాం.

జాబ్ మేళాలో 24 మందికి ఉద్యోగాలు

విశాలాంధ్ర – కోడుమూరు: వివేకానంద డిగ్రీ కళాశాలలో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాకు 36 మంది నిరుద్యోగులు హాజరయ్యారు. వీరిలో 24 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపల్ శేఖర్ తెలిపారు. శుక్రవారం జిల్లా స్కిల్ అధికారి ఆనంద్ రాజ్ కుమార్ ఆధ్వర్యాన కళాశాలలో ఉద్యోగ యువతీ యువకులకు జాబ్ మేళా నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి నియోజకవర్గంలో నెలకు ఒకసారి జాబ్ మేళా నిర్వహించి, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తోందన్నారు. ఎక్కడ నిరుద్యోగులు ఉండకూడదని జాబ్ మేళాల ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కూటమి ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. ప్రిన్సిపాల్ శేఖర్ మాట్లాడుతూ తమ కళాశాలలో ప్రభుత్వం ప్రత్యేకంగా డిజిటల్ కంప్యూటర్ ల్యాబ్ తో స్కిల్ సెంటర్ ఏర్పాటుచేసి విద్యార్థులకు వివిధ రకాల శిక్షణ ఇచ్చి ఉచితంగా సర్టిఫికెట్లు ఇస్తుందన్నారు. తమ కళాశాలలో చేరే విద్యార్థులకు స్కిల్ సెంటర్ ద్వారా ఉచితంగా కంప్యూటర్ శిక్షణ,ట్యాలీ, ఎమ్మెస్ ఆఫీస్, కమ్యూనికేషన్ స్కిల్స్, వివిధ రకాల సర్టిఫికేషన్ కోర్సులలో శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు ఇస్తుందన్నారు.అనంతరం డిగ్రీ పూర్తయిన తర్వాత ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. జాబ్ మేళాలో ఎంపికైన విద్యార్థులకు ప్రత్యేక అభినంద నలు తెలిపారు. జిల్లా స్కిల్ కోఆర్డినేటర్ వై వీరేష్,ప్లేస్మెంట్ అధికారి సాయి తేజ, స్కిల్ సిబ్బంది హరిబాబు పాల్గొన్నారు.

లైంగిక వేధింపులకు గురి చేస్తే చర్యలు తప్పవు

విశాలాంధ్ర బ్యూరో – కర్నూలు: పని ప్రదేశాల్లో మహిళా ఉద్యోగులను లైంగిక వేధింపులకు గురి చేస్తే చర్యలు తప్పవని కలెక్టర్ పి.రంజిత్ బాషా అన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో ఏపీజేఏసీ అమరావతి, కర్నూలు జిల్లా మహిళా విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకల సందర్భంగా కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన షీ బాక్స్‌ను జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లైంగిక వేధింపులు ఎదుర్కొంటున్న మహిళా ఉద్యోగులు బహిరంగంగా చెప్పలేని సమక్షంలో షీ బాక్స్‌లో ద్వారా ఫిర్యాదు చేయవచ్చని కలెక్టర్ సూచించారు. వేధింపులకు గురిచేసే వారిపై చర్యలు చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, డిఆర్ఓ వెంకటనారాయణమ్మ, ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ ఏవో సింధు సుబ్రహ్మణ్యం, ఏపీ జేఏసీ అమరావతి జిల్లా అధ్యక్షులు కెవై కృష్ణ, మహిళా విభాగం చైర్‌పర్సన్ సహీరా బాను, శివ పార్వతి, ఏపీఆర్ఎస్ఏ మరియూ ఏపీజేఏసీ ఉపాధ్యక్షులు అమరావతి సహఅధ్యక్షులు, పద్మావతి, జీఎస్ ఏపీజేఏసీ అమరావతి మహిళా విభాగం, మహిళలు ప్రతినిధులు, అన్ని ప్రభుత్వ శాఖల మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ మహిళా దినోత్సవం

విశాలాంధ్ర – కోడుమూరు: ఈనెల 8వ తేదీన ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని కోడుమూరులోని జివిఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ప్రపంచ మహిళా దినోత్సవాన్ని ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం, ఎంఈఓ–2 తైమూర్ బాష ఆధ్వర్యంలో జరిగిన ప్రపంచ మహిళా దినోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఈఓ–1 వసంత లక్ష్మిభాయ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వసంతలక్ష్మి భాయ్ మాట్లాడుతూ మానవ జీవన విధానం, కుటుంబ వ్యవస్థ మనుగడలో మహిళల ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు వివరించారు. ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా పాఠశాలలో పనిచేస్తున్న 15మంది ఉపాధ్యాయినీలు, నలుగురు ఆయాలను ఎంఈఓ వసంతలక్ష్మి భాయ్ దుశ్శాలువలు వేసి ఘనంగా సత్కరించారు. అనంతరం పాఠశాల హెచ్ఎం తైమూర్ బాష సిబ్బందితో కలిసి ఎంఈఓ వసంతలక్ష్మి భాయ్, ఏమార్పీ సత్యమ్మలకు శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి జాతీయ గీతం ఆలపించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం రామచంద్రుడు, రవికుమార్, ఇస్మాయిల్ సాహెబ్, అత్తాయి రసూల్, కిషోర్ కుమార్ రెడ్డి, శాంత మూర్తి నాయుడు, తిరుమల రెడ్డి, శ్రీనివాసులు, మహబూబ్ బాష, సిబ్బంది గాజుల కృష్ణమోహన్, కుమార్, పుల్లయ్య, రవిమునింద్ర పాల్గొన్నారు.

జి.పుల్లయ్య ఎంబీఏ విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర – కర్నూలు ఎడ్యుకేషన్: ఆర్‌జిఎం ఇంజనీరింగ్ కాలేజీ నేషనల్ లెవెల్ మేనేజ్మెంట్ మీట్ బుధవారం నిర్వహించారు. ఈ నేషనల్ లెవెల్ మేనేజ్మెంట్ మీట్ పోటీలకు జి. పుల్లయ్య కాలేజీ ఎంబీఏ విద్యార్థులు హాజరయ్యి తమ ప్రతిభను చాటి పోటీలలో బహుమతులు కైవసం చేసుకున్నారు. గురువారం పుల్లయ్య కాలేజీ మేనేజ్మెంట్ వారు గెలుపొందిన విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. ఈ అభినందన సభలో ప్రిన్సిపల్ డాక్టర్ సి. శ్రీనివాసరావు, డీన్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ ఎం గిరిధర్ కుమార్ మరియు ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ సి. నాగ గణేష్ పాల్గొన్నారు. నిర్వహించిన పోటీలలో ఫైనాన్స్, హెచ్ఆర్ఎంగ్ మేనేజర్ విభాగంలో మొదటి బహుమతులు, బిజినెస్ క్విజ్ విభాగంలో మొదటి రెండు బహుమతులు, మార్కెటింగ్ విభాగంలో రెండో బహుమతి కైవసం చేసుకున్నారు. ఈ పోటీలలో ఎంబీఏ చదువుతున్న మొదటి సంవత్సరం మరియు రెండవ సంవత్సరం విద్యార్థులు పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.శ్రీనివాసరావు బహుమతులు గెలుచుకున్న విద్యార్థులను అభినందిస్తూ. ఎంబీఏ విద్యార్థులు ఇలాంటి నేషనల్ లెవెల్ మేనేజ్మెంట్ మీట్లో పాల్గొని బహుమతులు సంపాదించి కాలేజీకి పేరు తీసున్నారని, పోటీలలో పాల్గొనడం ద్వారా విద్యార్థుల్లో పోటీ తత్వం పెరిగి మానసికంగా దృఢం కాగలరని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎం గిరిధర్ కుమార్ మాట్లాడుతూ ఇలాంటి పోటీలలో ఇంకెన్నో పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలని తెలియజేశారు.

నేటి నుండి కొంతలపాడు యాగంటి ఈశ్వరుడి బ్రహ్మోత్సవాలు

విశాలాంధ్ర – ఓర్వకల్లు : మండల పరిధిలోని ఎన్ కొంతలపాడు గ్రామంలో వెలసిన అంబా సహిత యాగంటీ ఈశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు నేటి నుంచి ప్రారంభమవుతున్నట్లు ఆలయ ఈవో చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ఉదయం స్వామి అమ్మ వార్లకు పంచామృతాభిషేకం రాత్రి 9 గంటలకు సీతారాముల బృందం వారిచే చెక్కభజన తెల్లవారు. జామున 3 గంటలకు నంది వాహనోత్సవం 9వ తేదీ ఉదయం పంచామృతాభిషేకం ధూప దీప నైవేద్యార్పణ రాత్రి 9 గంటలకు రేలారే రేలా జానపద జబర్దస్త్ వారితో సినీ సంగీత విభావరి తెల్లవారు జామున 4 గంటలకు స్వామివారి రథోత్సవం 10వ తేదీ ఉదయం సోమవారం స్వామి అమ్మవారి పూజా కార్యక్రమాలు సాయంత్రం పారువేట నందికోల సేవ పల్లకి ఉత్సవాలు జరుగుతాయని తెలిపారు.



ఆలయ చరిత్ర: సుమారు 300 ఏళ్ల కిందట యాగంటి అయ్యా ఆచార్యులు స్వామి వారు గ్రామ వెలుపలగల మూడు నదులు మరియు మూడు గ్రామాల పొలిమేరలు కలిసే చోట స్మశానానికి ఎదురుగా సజీవ సమాధి అయినాడు. కొడిదికుంట్ల కిష్టాపురం లో జన్మించిన వీరు బాల్యం నుండి భక్తి జ్ఞాన వైరాగ్యములు ఆ మరి మనసు వాక్కు ఖాయములు త్రికరణ శుద్ధి కలిగి వారి వాక్కు నుండి వెలువడిన ప్రతి మాట తప్పకుండా జరుగుతూ వచ్చేది అంతేకాక వీరు అనేక మహిమలు చూపిన మహిమాన్వితుడుగా పేరుగాంచాడు నిత్యం శివ పంచాక్షరి మహామంత్రం ఉపాసన చేస్తూ సంపూర్ణ జ్ఞాన స్థితిని భావించి జీవ బ్రహ్మైక్యము నిత్యము శివ పంచాక్షరి మహామంత్రం ఉపాసన చేసినందువలన యాగంటి స్వామి అను నామకరణముతో స్థిరపడి నేటికీ అఖండ ధూప దీప నైవేద్యాలతో పూజలు అందుకొనుచు న్నాడు. గ్రామ రెడ్డి అరెస్ట్ వారెంట్ నుండి కాపాడి వారికి సంతాన ప్రాప్తి కలిగించి గడ్డివాములను మంటలనుండి కాపాడి 12 తులాల కరిగిన బంగారంను తాగి, మరలా చేయుట సున్నమును అన్నముగా కప్పలను అప్పలుగా మార్చాడని స్వామి మహిమలగురించి ప్రజలు చెబుతున్నారు.

నేడు అంతర్ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు : యాగంటి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఎనిమిదవ తేదీ అంతర్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీలలో పాల్గొను టీం సభ్యులు ప్రవేశ రుసుము 500 చెల్లించాలని విజేతలకు మొదటి రెండు మూడు నాలుగు, ఐదు, ఆరో బహుమతులకు నగదును అందజేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వివరాల కోసం 8297978854, 7095464269 నెంబర్లను సంప్రదించాలన్నారు. పదవ తేదీన అంతర్రాష్ట్రస్థాయి పాలవండ్ల మండలాలు పోటీల నిర్వహిస్తున్నట్లు రైతు సంఘం నాయకులు తెలిపారు విజేతలకు నగదు బహుమతులను అందజేస్తున్నట్లు తెలిపారు. 97013 38439, 9963 628175, నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

మహిళలు సమాజంలో స్ఫూర్తిదాయకంగా నిలవాలి

విశాలాంధ్ర – కర్నూలు ఎడ్యుకేషన్: మహిళలు సమాజంలో స్ఫూర్తిదాయకంగా నిలవాలని కర్నూలు జిల్లా రెవెన్యూ అధికారి సి.వెంకట నారాయణమ్మ పేర్కొన్నారు. శుక్రవారం కర్నూలు నగరంలోని డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీలో ప్రపంచ మహిళా దినోత్సవంను పురస్కరించుకొని నిర్వహించిన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు వీర వనితలుగా సమాజ శ్రేయస్సు కోసం అహర్నిశలు కృషి చేస్తుంటారన్నారు. బాలికలు, మహిళలు చదువుకున్నప్పుడే ఉన్నత శిఖరాలను అధిరోహించే అవకాశం ఉంటుందన్నారు. విద్య లేకపోతే సమాజం లో మార్పు రాదని పేర్కొన్నారు అలాగే సమాజం అభివృద్ధి చెందాలంటే స్త్రీ శక్తి అభివృద్ధి చెందాలి అప్పుడే మహిళా సాధికారత జరిగిందన్నదానికి అర్థం ఉంటుందన్నారు. ఉన్నత ఆశయాలను పెట్టుకొని విద్యార్థినీలు కష్టపడి చదివి తన లాగా ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. యూనివర్సిటీ ఇంచార్జ్ వైస్ ఛాన్సెలర్ ప్రొఫెసర్ పి.ఎస్. షా వలి ఖాన్ మాట్లాడుతూ మహిళలను కేవలం ఒక వస్తువు లాగా సమాజం చూస్తుందని, దానికి తోడుగా మగవారు దురాలోచనలతో మహిళలపై అసభ్యంగా మాట్లాడడం, వారిపై దురాచారాలకు పాల్పడడం సరైనది కాదన్నారు. మన ఆలోచనలు మారినప్పుడే సమాజంలో మార్పు వస్తుందన్నారు. రాజ్యాంగం మహిళలకు కల్పించిన హక్కులతో ఉన్నత చదువులు చదువుకొని తమ సొంత కాళ్ళపై నిలబడాలన్నారు. తమ యూనివర్సిటీ విద్యార్థిని జాస్మిన్ జహాన్ జాతీయ స్థాయిలో యంగ్ లీడర్ కాంక్లేవ్ కు రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహించి యూనివర్సిటీకి మంచి పేరు తెచ్చినందుకు ఆమెను అభినందించారు. తోటి విద్యార్థినిలు జాస్మిన్ జహాన్ ను స్ఫూర్తిగా తీసుకోవాలని వీసీ పిలుపునిచ్చారు. అనంతరం ఇంచార్జ్ వైస్ ఛాన్సెలర్ ప్రొఫెసర్ పిఎస్ షావలి ఖాన్ జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మను శాలువ కప్పి జ్ఞాపిక అందజేశారు. ఇంచార్జి ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్. మహబూబ్ బాషా, యూనివర్సిటీ మహిళా సాధికారత సెల్ సభ్యులు డాక్టర్ జహనార, డాక్టర్ నిర్మల, విద్యా గోదావరి, డాక్టర్ నబియా సుల్తానా డాక్టర్ అమతుర్ రహీం పాల్గొన్నారు.

నోటి ఆరోగ్య పరీక్షకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

విశాలాంధ్ర – ఆత్మకూరు రూరల్: దశాబ్ద కాలంగా దంతాల సెన్సి బిలిటీని ముందుగానే గుర్తించుకునే సాధికారత కల్పిస్తూ చిల్ టెస్ట్‌ల ద్వారా దేశవ్యాప్తంగా సెన్సోడైన్ నిర్వహిస్తోందని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ అశోక్ దోల్తే తెలిపారు. కేటగిరి లీడ్ ఓవర్ హెల్త్ హాలియాన్, ఇండియా సబ్ కాంటినెంట్ కిస్లే సేథ్ మాట్లాడుతూ ప్రజలు తమ నోటి ఆరోగ్యం వైపు మొదటి అడుగు వేయమని ప్రోత్సహించడమే తమ అంతిమ లక్ష్యమన్నారు. మహాకుంభ్ –2025 లో గిన్నిస్ వరల్డ్ రికార్డును నెల కొల్పడం సంఖ్యలు మాత్రమే కాదని, ఇది వేలాదిమంది వ్యక్తులను చేరుకోవడం, అవగాహన పెంచడం కోసమే అన్నారు. వరల్డ్ ఓరల్ హెల్త్ పేరిట ఉచిత డిజిటల్ దంత పరీక్షలు చేయడం జరుగుతుందని, దేశ ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నోటి ఆరోగ్య పరీక్షకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి, ఉచిత డిజిటల్ దంత పరీక్షలను ఎక్కువమంది అందించడానికి సిద్ధంగా ఉన్నా మని చెప్పారు. నూతనంగా విడుదల చేసిన రూ.20లకు లభించే చిన్న టూత్ పేస్ట్ ప్యాకును వితరణ చేసిందన్నారు. దీని ద్వారా సెన్సిటివిటీ రక్షణను మరింత సరసమైన అందరికీ అందుబాటులోకి తీసుకొచ్చేలా రూపకల్పన చేసినట్లు తెలిపారు. గతంలో ఉన్న రికార్డులను ఆన్లైన్లో 24 గంటల్లో అత్యంత ఎక్కువ దంత పరీక్షలను విజయవంతంగా పూర్తి చేసి గిన్నిస్ బుక్ రికార్డును సొంతం చేసుకున్నారు. ఈనెల 20న ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవం సమీపిస్తున్న తరుణంలో సెన్సోడైన్ తన ప్రయత్నంలో భాగంగా అవగాహన, సాంకేతికత, అందుబాటును ఏకీకృతం చేస్తూ పెద్ద ఉద్యమానికి వేదికను ఏర్పాటు చేస్తుందన్నారు. భవిష్యత్తులోనూ మల్టీమీడియా వ్యూహాన్ని సక్రియం చేస్తుందని, తద్వారా దేశ ప్రజలు తమ నోటి ఆరోగ్యం కోసం మొదటి అడుగు వేయాలని ప్రోత్సాహాన్ని అందిస్తుందని వారు స్పష్టం చేశారు.

హనుమంత వాహనంపై ఊరేగిన జ్వాల నరసింహుడు

విశాలాంధ్ర – ఆళ్లగడ్డ : ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన అహోబిలం లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో బ్రహ్మోత్సవాలు అహోబిలం జనరల్ మేనేజర్ మురళీధరన్, జాబితా సలహా సభ్యులు వైకుంతం, మణిందర్, అడ్మినిస్ట్రేషన్ అధికారి సుదర్శన్ ల ఆధ్వర్యంలో కన్నుల పండుగలా జరుగుతున్నాయి. అందులో భాగంగా నాలుగవ రోజైన శుక్రవారం ఉదయం జ్వాల నరసింహ స్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను ప్రత్యేకంగా పట్టు వస్త్రాలు, పూలమాలలతో అలంకరించి యోగా నృసింహ గారుడ విమానం లో కొలువుదీర్చి పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ మాడ వీధుల గుండా గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం ఉత్సవముమూర్తులకు అర్చకులు వేదమంత్రాల మధ్య పంచామృతాభిషేకం నిర్వహించారు. రాత్రి జ్వాల నరసింహ స్వామి హనుమంత వాహనంపై కొలువు దీరి భక్తులకు దర్శనమిచ్చారు. పూజల అనంతరం హనుమంత వాహనంపై స్వామివారిని కూర్చోండ బెట్టి ఆలయ మాడ వీధుల గుండా గ్రామోత్సవం నిర్వహించారు.

దిగువ అహోబిలంలో: బ్రహ్మోత్సవాలలో భాగంగా దిగువ అహోబిలంలో మూడవ రోజైన శుక్రవారం హంస వాహనం సేవ అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాలాచార్యులు ఆధ్వర్యంలో అర్చక బృందం వేకువజామునే అర్చక బృందంతో కలిసి ఉత్సవమూర్తులైన ప్రహ్లాద వరద స్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం హంస వాహనంలో కొలువుంచి ఆలయ మాడ వీధుల గుండా ఊరేగింపుగా మఠం వద్దకు చేరుకున్నారు. మఠం వద్ద 46వ పీఠాధిపతి శ్రీవన్ శ్రీ శఠగోప రంగనాథ యతేంద్ర మహాదేశికన్ స్వామి ఉత్సవ మూర్తులకు మహా మంగళ హారతి సమర్పించి పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ఉత్సవముర్తులకు ప్రధాన అర్చకులు అభిషేకం నిర్వహించారు. రాత్రి సూర్య ప్రభ వాహనంపై ప్రహ్లాద వరద స్వామి కొలువుదీర్చి మాడ వీధుల గుండా గ్రామోత్సవం నిర్వహించారు. కాగా పీఠాధిపతిని నంద్యాల ఆర్డీవో విశ్వనాథ్ మర్యాదపూర్వకంగా కలిసి ఆశీస్సులు అందుకున్నారు.

విద్యతోనే మహిళల అభివృద్ధి

విశాలాంధ్ర – కర్నూలు ఎడ్యుకేషన్: ప్రతి మహిళా చదువుకున్నప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని ప్రభుత్వ న్యాయవాది సి. సరళాదేవి పేర్కొన్నారు. శుక్రవారం క్లస్టర్ యూనివర్సిటీ సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సి.సరళా దేవీ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ మహిళ చదువుకుంటే ఆ కుటుంబంలో ప్రతి ఒక్కరికి చదువు చెబుతుందన్నారు. లింగ సమానత్వం గురించి అవగాహన పెంచడం, మహిళల గొంతులు వినిపించడం వారి హక్కులను రక్షించడం వంటివి చాలా కీలకమ న్నారు. విద్యార్థులు మారుతున్న సమాజంలో ఆహారం విషయంలో కూడా జాగ్రత్తలు తీసుకుని మంచి ఆహరం తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పురాణాల్లో మహిళలకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారని ఆనాటి ప్రాధాన్యత నేడు లేకపోవడం బాధాకరమన్నారు. మహిళా సాధికారత విభాగం కన్వీనర్ డాక్టర్ అక్తర్ భాను మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మహిళలను గౌరవించాలని అన్నారు. స్త్రీ లేకపోతే జీవమే లేదని సిల్వర్ జూబ్లీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వివిఎస్ కుమార్ అన్నారు. మహిళలకు స్వేచ్ఛ ఉండాలని, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసాద్ రెడ్డి అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా అధ్యాపకులకు, విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించి బహుమతులు ప్రధానం చేశారు. అతిథులను సన్మానించారు. డాక్టర్ అనూష, డాక్టర్ సప్న డాక్టర్ ఫామీద, డాక్టర్ పార్వతి, డాక్టర్ షనవాజ్, డాక్టర్ వినోలియా, డాక్టర్ విమల, బోధ నేతర సిబ్బంది పాల్గొన్నారు.

పొగాకు రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వాలి

విశాలాంధ్ర – ఓర్వకల్లు : ఓర్వకల్లులోని ఐటీసీ పొగాకు కంపెనీ గోడౌన్ సందర్శించి, రైతుల పడు తున్న కష్టా లను, గిట్టు బాటు ధరను వైఎస్ఆర్సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అడిగి తెలుసుకున్నారు. రైతులకు కనీస వసతులు కల్పించాలని అధికారులను ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ మీది వేముల ప్రభాకర్ రెడ్డి, జడ్పిటిసి రంగనాథ్ గౌడ్, వెంగన్న, మహేశ్వర్ రెడ్డి, శంకర్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గాలి కుంటు వ్యాధిని నివారిద్దాం

విశాలాంధ్ర – క్రిష్ణగిరి: పశువులకు టీకా వేయించి గాలికుంటు వ్యాధిని నివారించాలని జిల్లా పశు సంవర్త శాఖ డిప్యూటీ డైరెక్టర్ దుర్గాప్రసన్న బాబు అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన క్రిష్ణగిరి పశు వైద్యశాలను పరిశీలించి పశువులకు ఆయన టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి వస్తే తీవ్రజ్వరము వచ్చి నీరసం ఉండడం, నోటినుంచి చొంగ కారడం, నోటికి కాళ్ళగిట్టల మధ్య పుండ్లు వ్యాపించడం జరుగుతుందన్నారు. కొద్దిపాటి ఎండకు రోప్పడం చూడిపశువులు ఈసుకపోవడం జరుగుతుందన్నారు. వీటిని నివారించేందుకు తప్పనిసరిగా టీకా వేయించాలని ఆయన తెలిపారు. ఈ వ్యాధి సోకకుండా ఉండాలంటే ఏడాదికి మూడుసార్లు తప్పనిసరిగా బ్రూసేలోసిస్ వ్యాధి నిరోధిక టీకా వేయించాలి 4–8 నెలల వయసు గల పెయ్య దూడలకు వ్యాధి నివారణ కొరకు టీకాలు వేయించాలన్నారు. వ్యాధిగ్రస్తా పశువులు మిగిల్చిన మేత, గర్భాశ్రమం మట్టి,మాయ, పిండాలను గొయ్యి తీసి పూడ్చాలన్నారు. పశువులకు సకాలంలో టీకాలు వేయిద్దాం వ్యాధిని నిర్మూలిద్దాం అనే నినాదాన్ని ప్రతి ఒక్కరు పాటించాలని ఆయన కోరారు. క్రిష్ణగిరి పశువైద్యాధికారి నవీన్, రైతులు ఉన్నారు.

కామన్న వేడుకలు ప్రారంభం

విశాలాంధ్ర–హొళగుంద: మండల కేంద్రంలో శుక్రవారం నుండి కామన్న వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. స్థానిక పేట వీధిలో కామన్ విగ్రహాన్ని స్థాపించి ప్రజలు ఘనంగా పూజలు నిర్వహించి గొర్రె ఊరేగింపు తో పాటు వివిధ వేషధారణలతో పురవీధుల్లో తిరిగారు. కామన్న వేడుకలు కామన్న ఉత్సవ కమిటీ నిర్వాకులు ఎంతో భక్తి శ్రద్ధలతో వారం రోజులపాటు వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. కామన్న వేడుకలు నిర్వహించడం ఎన్నో ఏళ్ల నుండి ఆనవాయితుగా వస్తుందని దాన్ని అలాగే కొనసాగిస్తున్నామని ఉత్సవ కమిటీ నిర్వాహకులు జాన్ టి వీరేష్ అన్నారు. ఉత్సవ కమిటీ నిర్వాహకు లతూపాటు ప్రజలు చెల్లించిన విరాళంతో సాంస్కృతిక కార్యక్రమాలు, వేషధారణలు, తేల్లా మరియు నల్ల ఏనుగుల ఊరేగింపు, మజ్జిగ బండి ఎంతో ఆర్భాటంగా నిర్వహిస్తామని అన్నారు. హోలీ ముగింపు రోజు ప్రజలందరూ రంగును చల్లుకొని హోలీపండుగను జరుపుకుంటున్నామని పేర్కొన్నారు. కామన్న వేడుకలు జరగడంతో ప్రజలకు ఎంతో మనోరంజకంగా ఉంటుంది.